Email : telanganaveenaoffcial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

సంపుటి :1 | సంచిక : 97 | హైదరాబాద్ | బుధవారం | 20 -12 - 2023 | పేజీలు : 8 | రూ.4




## తెలంగాణ నుంచి లోక్‌సభ బరిలో మోదీ..!



**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ :** లోక్ సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ దక్షిణాది రాష్ట్రాలపై బీజేపీ స్పెషల్ ఫోకస్ పెట్టింది. ఈసారి దక్షిణాదిలో మెజారిటీ ఎంపీ సీట్లను గెల్చుకోవాలని పార్టీ హైకమాండ్ భావిస్తోంది. ఇందుకోసం ప్రధాని నరేంద్ర మోదీని తెలంగాణ నుంచి లోక్ సభ బరిలోకి దింపాలని నిర్ణయించినట్లు సమాచారం. తెలంగాణ నుంచి మోదీ పోటీ చేస్తే రాష్ట్రంలో మెజారిటీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకోవచ్చనేదే ఈ నిర్ణయానికి కారణమని తెలుస్తోంది. గత సార్వత్రిక ఎన్నికల్లో మోదీ వారణాసి నుంచి పోటీ చేసి గెలిచారు. మోదీ స్వయంగా వారణాసిలో పోటీ చేయడంతో ఉత్తరప్రదేశ్ లో బీజేపీ అత్యధిక ఎంపీ స్థానాల్లో గెలిచింది. తెలంగాణలోనూ ఇదే ఫార్ములా అనుసరించాలని పార్టీ పెద్దలు యోచిస్తున్నారు. ఈమేరకు ప్రధాని మోదీకి పార్టీ సీనియర్ నేతలు ఇప్పటికే ప్రతిపాదన చేసినట్లు సమాచారం. తెలంగాణలో మొత్తం 17 ఎంపీ స్థానాలు ఉన్నాయి. ఇందులో కనీసం 12 సీట్లను గెలుచుకోవాలని బీజేపీ నేతలు భావిస్తున్నారు. గత ఎన్నికల్లో దక్షిణాది రాష్ట్రాలలో బీజేపీ పెద్దగా ప్రభావం చూపలేక పోయింది. ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ సీనియర్ నేతలు ఓటమి చవిచూసిన విషయం తెలిసిందే. ఈ ఏడాది మే లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు జరగగా.. అధికారాన్ని నిలబెట్టుకోవడంలో బీజేపీ విఫలమైంది. దీంతో పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఈ రెండు రాష్ట్రాలపై పార్టీ నేతలు స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఇందులో భాగంగా ప్రధాని మోదీని తెలంగాణలోని సికింద్రాబాద్ లేదా మల్కాజిగిరి లోక్ సభ నియోజకవర్గం నుంచి బరిలోకి దింపే సూచనలు కనిపిస్తున్నాయి.

## ప్రజలకు మరో రెండు గ్యారెంటీలు.. అమలు ముహూర్తం ఇదే



# రేవంత్ రెడ్డి మరో సంచలనం..

**తెలంగాణ వీణ/తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో కాంగ్రెస్‌ను పదేళ్ల తర్వాత అధికారంలోకి తీసుకురావడంలో కీలకంగా మారాయి ఆరు గ్యారంటీలు. తుక్కుగూడ వేదికగా సోనియాగాంధీతో ఈ ఆరు గ్యారంటీలను ప్రకటింపజేసింది టీకాంగ్రెస్.మరోవైపు 42 పేజీల మేనిఫెస్టో, జాబ్ క్యాలెండర్ హామీ, పెన్షన్ల పెంపు, రుణమాఫీ, రైతుభరోసా లాంటి హామీలు అన్నివర్గాలను కాంగ్రెస్ వైపు మళ్లించాయి. దీంతో 64 సీట్లతో కాంగ్రెస్ తెలంగాణలో అధికారంలోకి వచ్చింది. సీఎంగా రేవంత్‌రెడ్డి, మరో 11 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ నేపథ్యంలో ఆరు గ్యారంటీల అమలుపై కాంగ్రెస్ సర్కార్ దృష్టిపెట్టింది.

### కొలువు దీరిన రెండు రోజులకే..

సర్కార్‌కొలువు దీరిన రెండు రోజులకే రెండు గ్యారంటీలను అమలుకు శ్రీకారం చుట్టారు సీఎం రేవంత్‌రెడ్డి. డిసెంబర్ 7న ప్రభుత్వం ఏర్పడగా, డిసెంబర్ 9న సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా ఆరోగ్యశ్రీ పరిమితి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచారు. ఇక మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభించారు. ఉచిత ప్రయాణంతో ఆర్టీసీ ఆక్యుపెన్సీ 40 శాతం పెరిగింది. మహిళా ప్రయాణికులతో బస్సులు కిటకిటలాడుతున్నాయి.

### త్వరలో మరో రెండు గ్యారంటీలు..

తెలంగాణ ప్రభుత్వం గ్యారంటీల అమలుపై వేగంగా అడుగులు వేస్తోంది. ఎన్నికల వేళ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమల్లో భాగంగా మరో రెండు పథకాల అమలుకు ముహూర్తం నిర్ణయించింది. కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవమైన ఈ నెల 28వ తేదీ ఇందుకు ముహూర్తంగా ఖరారు చేసింది. కొత్త సంవత్సరం కానుకగా ఇవి అమల్లోకిరానున్నాయి.

### పీఏసీలో చర్చ..

తాజాగా తెలంగాణ కాంగ్రెస్ నిర్వహించిన రాజకీయ వ్యవహారాల కమిటీ(పీఏసీ) సమావేశంలోనూ ఆరు గ్యారెంటీలపై చర్చ జరిగింది. భారీ కసరత్తు అవసరం లేకుండా, తక్షణమే ప్రారంభించగలిగే పథకాలు ఏమున్నాయనే అంశంపై గాంధీ భవన్‌లో జరిగిన కాంగ్రెస్ పీఏసీలో చర్చించారు. ఇందులో పింఛన్ పెంపు, రూ.500 సిలిండర్ అమలు చేయాలని నిర్ణయించారు. పార్టీ వ్యవస్థాపక దినమైన డిసెంబరు 28 నుంచి ఈరెండు గ్యారంటీల అమలు ప్రక్రియను ప్రారంభించాలని నిర్ణయించారు.

### ఎక్కువ మందిని ప్రభావితం చేసేలా..

గ్యారంటీల్లో తక్కువ భారం పడడంతోపాటు ఎక్కువ మందిని ప్రభావితం చేసే పథకాలుగా పెన్షన్, సబ్సిడీ సిలిండర్‌ను గుర్తించారు. వీటిద్వారా వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి లబ్ధి కలుగుతుందని భావిస్తోంది. ఈ క్రమంలో 'చేయూత'లో భాగంగా నెలవారీ పింఛన్ రూ.4 వేలకు పెంచి ఇవ్వాలన్నదానిపై ఏకాభిప్రాయం వ్యక్తమైనట్లు తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా పింఛను తీసు కుంటున్న లబ్ధిదారుల లెక్కలు కూడా సిద్ధంగా ఉన్నా యి. ప్రతీనెల 45 లక్షల పైగా బ్యాంకు ఖాతాలకు నగ దు బదిలీ జరుగుతోంది. వృద్ధులు, వితంతువులు, చేనే త, గీత, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, హెచ్ఐ వీ, బోదకాలు బాధితులకు ప్రస్తుతం ఆసరా పిం ఛను కింద నెలకు రూ.2,016 చొప్పున ఇస్తున్నారు. ఇకపై ఇది రూ.4 వేలు కానుంది. ఇప్పటివరకు నెలకు రూ. 900 కోట్ల వరకు ఖర్చవుతుండగా.. పెరిగే పింఛను మొత్తంతో ఇది నెలకు రూ.1,800 కోట్లు చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఏడాదికి రూ.21,600 కోట్లకు చేరనుంది. దివ్యాంగులకు ప్రస్తుతం రూ.4,016 ఇస్తున్నారు. దీనిని పెంచే విషయమై రెండు, మూడు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## బీఆర్ఎస్ ఎంపీలకు కేసీఆర్ పిలుపు



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** పార్లమెంట్‌లో ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలు, పెద్ద సంఖ్యలో ఎంపీల సస్పెన్షన్ నేపథ్యంలో బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ స్పందించారు. వెంటనే హైదరాబాద్ కు రావాలంటూ తమ పార్టీ ఎంపీలకు ఆదేశాలు జారీ చేశారు. ఉన్నపళంగా వెనక్కి వచ్చేయాలని సూచించారు. పార్టీ ఎంపీలతో కేసీఆర్ విడివిడిగా భేటీ అవుతారని బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. ఇటీవల హిప్ రిప్లేస్ మెంట్ చికిత్స చేయించుకున్న కేసీఆర్ ప్రస్తుతం నందినగర్ లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. కాగా పార్లమెంట్ లో సోమవారం 93 మంది సభ్యులపై సస్పెన్షన్ వేటు పడగా.. మంగళవారం మరో 50 మంది ఎంపీలపై వేటు పడింది. దీంతో సభలు సజావుగా సాగే పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ ఎంపీలను కేసీఆర్ వెనక్కి పిలిచినట్లు తెలుస్తోంది.


## కొత్త రేషన్ కార్డుల జారీకి ఆదేశాలు...

**- డిసెంబర్ 28 నుంచి దరఖాస్తులు**



**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** తెలంగాణలో 6 ఏళ్లుగా ఎదురుచూస్తున్న కొత్త రేషన్ కార్డు జారీ ప్రక్రియ.. రేవంత్ రెడ్డి నేతృత్వంలో కొత్తగా కొలువైన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. డిసెంబర్ 28 నుంచి కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించనున్నారు. దీంతో పాటు ఇప్పటికే ఉన్న రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులూ, తప్పులు సరిచేయడం తదితర అంశాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ నెల 28 నుంచి రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో గ్రామ సభ నిర్వహిస్తామని, కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు, హౌసింగ్‌పై గ్రామ సభలో నిర్ణయం మేరకు లబ్ధిదారులను ఎంపిక చేస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రేషన్ దుకాణాల్లో పంపిణీ చేసే బియ్యం పక్కదారి పట్టకుండా నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ ఇప్పటికే అధికారులకు ఆదేశాలిచ్చారు.హైదరాబాద్‌లోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం గాంధీ భవన్‌లో సోమవారం (డిసెంబర్ 18) కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ భేటీ జరిగింది. ఈ భేటీలో పలు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో రేషన్ కార్డుల జారీ ప్రక్రియ గురించి మంత్రులు, కాంగ్రెస్ నేతలకు మంత్రి ఉత్తమ్ కీలక వివరాలు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 28 నుంచి దరఖాస్తులు స్వీకరించి, గ్రామ సభలో లబ్ధిదారులను ఎంపిక చేస్తామని తెలిపారు.గత ప్రభుత్వంలో సుమారు ఆరేళ్లుగా కొత్త రేషన్ కార్డుల జారీ లేదు. ఉన్న కార్డుల్లో పేర్ల నమోదుకు కూడా అవకాశం ఇవ్వలేదు. దరఖాస్తు చేసుకున్నవారికి ఎదురుచూపులే మిగిలాయి. రేషన్ కోసమే కాకుండా, ఆరోగ్యశ్రీ తదితర సేవలకూ రేషన్ కార్డులు తప్పనిసరి అయ్యాయి. కొత్తగా రేషన్ కార్డులు జారీ చేయకపోవడంతో లక్షలాది మంది పేదలు ఆయా సేవలు అందుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో కొత్త రేషన్ కార్డుల కోసం పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది.

## సమ్మక్క సారలమ్మ కేంద్ర విశ్వవిద్యాలయానికి చట్ట బద్ధత




**- విభజన హామీలో ములుగుకు గిరిజన యూనివర్సిటీనీ మంజూరు చేసిన 2014లో కాంగ్రెస్ హామీ - బిల్లును ఆమోదించిన రాష్ట్రపతికి ధన్యవాదాలు - పంచాయితీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు శ్రీమతి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క**

**తెలంగాణ వీణ/ములుగు:** హైదరాబాద్‌లో శీతాకాల విడిదికి వచ్చిన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గారిని మర్యాద పూర్వకంగా కలిసి సమ్మక్క సారలమ్మ కేంద్ర విశ్వవిద్యాలయానికి చట్ట బద్దత కల్పిస్తూ బిల్లును ఆమోదించిన సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది మూర్ము గారికి ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపిన తెలంగాణ రాష్ట్ర పంచాయితీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు శ్రీమతి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అనంతరం మాట్లాడుతూ గత సంవత్సరం డిసెంబర్ నెలలో రామప్పకు రాష్ట్రపతి వచ్చిన సందర్భంగా గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేయాలని నేను కోరడం జరిగిందని ఇప్పుడు రాష్ట్రపతి శీతాకాల విడిదికి వచ్చిన సందర్భంగా చట్ట బద్ధత కల్పించిన రాష్ట్రపతి గారికి కృతజ్ఞతలు 2014 లో రాష్ట్ర విభజన హామీ ప్రకారం ములుగు జిల్లా

వివరాలు 2లో

## ఆరు గ్యారెంటీలను ఖచ్చితంగా అమలు చేస్తాం

**- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**తెలంగాణ వీణ/ఖమ్మం ప్రతినిధి:** ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 6 గ్యారంటీలను ఖచ్చితంగా అమలు చేస్తామని రాష్ట్ర రెవిన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో పాలేరు నియోజకవర్గ అభివృద్ధి పనులపై మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, ప్రజలు ఆశించిన ఆశయాల మేరకు, వారి నమ్మకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వమ్ము చేయమని అన్నారు. ప్రతి అంశంలో రాష్ట్ర వ్యాప్తంగా శ్వేత పత్రం విడుదల చేస్తామన్నారు. అధికారులు తమ తమ శాఖలకు సంబంధించి ఖచ్చితమైన లెక్కలు ఇవ్వాలన్నారు. సమీక్షలో పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ, ఇర్రిగేషన్, రోడ్లు భవనాలు, డబల్ బెడ్ రూమ్, వైద్యం, రిజిస్ట్రేషన్, ఎక్సైజ్ శాఖల పనులపై సమీక్ష చేశారు.

వివరాలు 2లో

## సమ్మక్క సారలమ్మ కేంద్ర విశ్వవిద్యాలయానికి చట్ట బద్దత

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు ఆనాటి కాంగ్రెస్ పార్టీ హామీ ఇవ్వడం జరిగిందని గిరిజన యూనివర్సిటీ వలన ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగు పడుతుంది అని వెనుకబడిన ములుగు జిల్లా అభివృద్ధి చెందుతుంది గిరిజన యూనివర్సిటీ కి 889 కోట్ల రూపాయలు మంజూరు కావడం జరిగిందని పనులు ప్రారంభించి త్వరగా తరగతులు ప్రారంభం అయ్యే విధంగా రాష్ట్ర ప్రభుత్వం నుండి కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకువస్తామని సీతక్క అన్నారు.

## క్షతగాత్రులను పరామర్శించిన విప్ ఆది






**తెలంగాణ వీణ/సిరిసిల్ల:** వేములవాడ రూరల్ మండలం పోశెట్టిపల్లి వద్ద మంగళవారం జరిగిన ఆటో ప్రమాదంలో గాయపడిన... వేములవాడ, సిరిసిల్ల ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులతో పాటు మృతి చెందిన కుటుంబాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరామర్శించారు.గాయపడిన వారిని యోగక్షేమాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని కోరారు.దురదృష్టవషత్తు ఆటో ప్రమాదంలో మృతి చెందిన కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పారు.బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి సాయం అందేలా చేస్తానని విప్ ఆది శ్రీనివాస్ చెప్పారు.

## టిజెఎస్ఎస్ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్

**- నూతన ప్రజా ప్రభుత్వానికి అభినందన సభకు భారీగా తరలి రండి**

**తెలంగాణ వీణ/సిరిసిల్ల:** తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చలో హైదరాబాద్.. నూతన ప్రజా ప్రభుత్వానికి అభినందన సభ 22 డిసెంబర్ నాడు రవీంద్రభారతిలో నిర్వహించే ఈ సభకు తెలంగాణ జర్నలిస్ట్ సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల జర్నలిస్టులు అందరూ రావాలని పిలుపునిస్తున్నాము. కాంగ్రెస్ ప్రభుత్వంలో జర్నలిస్టుల సమస్యలు తీరడంతో పాటు ప్రజా ప్రభుత్వంగా ప్రజల సమస్యలు తీర్చే విధంగా జర్నలిస్టులు ముందుండాలని కోరుతున్నాము. టి(టిజెఎస్ఎస్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సభకు రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు భారీ సంఖ్యలో హాజరు కాలవాలని కోరుతున్నాము.

## మెదడులో జ్ఞాపకాలపై నిద్రా సమయ శ్వాస ప్రభావం



**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ :** నిద్రా సమయంలో మనం తీసుకునే శ్వాస మెదడులోని జ్ఞాపకాలపై ఎలాంటి ప్రభావం చూపిస్తుందో పరిశోధకులు తాజాగా అధ్యయనం చేశారు. నిద్రా సమయంలో మెదడు లోని ప్రకంపనలకు తిరిగి జ్ఞాపకాలు ప్రేరేపితం కావడానికి సంబంధం ఉందని జర్మనీకి చెందిన పరిశోధకులు స్పష్టం చేశారు. నిద్రలో తీసుకునే ఊపిరికి మేలుకొనే సమయంలో జ్ఞాపకాలు గుర్తు తెచ్చుకోడానికి గల సంబంధాన్ని ఇతర అధ్యయనాలు వెల్లడించినా, శ్వాసక్రియ కూడా నిద్రాసమయంలో జ్ఞాపకాలను కలిగించే ప్రక్రియకు తోడ్పడుతుందని తమ అధ్యయనంలో తేలిందని జర్మనీకి చెందిన ముంచెయన్ యూనివర్శిటీ పరిశోధకులు థామస్ స్ర్కీనియర్ వెల్లడించారు.

# ఆరు గ్యారెంటీలను ఖచ్చితంగా అమలు చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

మిషన్ భగీరథ ద్వారా క్షేత్ర స్థాయిలో ఎంత మంది ప్రజలు, ఎన్ని గృహాలకు త్రాగునీటి సరఫరా చేస్తున్నది నివేదిక సమర్పించాలన్నారు. విద్యుత్ ఎన్ని గంటలు ఇస్తున్నది తెలుపాలన్నారు. జెఎన్టియు ఇంజనీరింగ్ కళాశాలకు స్థల కేటాయింపు, ఫ్యాకల్టీ, పూర్తి స్థాయిలో కళాశాల నడిచేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. నేషనల్ హైవే ద్వారా చేపడుతున్న ప్రాజెక్టుల పురోగతి, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పాలేరు నియోజకవర్గ పరిధిలో పంచాయతీ రాజ్ కు సంబంధించి 2 సబ్ డివిజన్లు ఉన్నట్లు, 143 గ్రామ పంచాయతీలు ఉండగా, 95 గ్రామ పంచాయతీలకు స్వంత భవనాలు ఉండగా, 43 భవనాలు ఇజిఎస్ క్రింద మంజూరయి పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మిగిలిన 5 గ్రామ పంచాయతీల భవనాల నిర్మాణానికి ఇజిఎస్ క్రింద ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. సీతారామ ప్రాజెక్టు క్రింద 2 ప్యాకేజీల పనులు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. అవసరం లేని చోట భూసేకరణలు చేసిన దగ్గర అవసరాలకు పనికివచ్చే భూములను చుట్టుపక్కల గ్రామాల నిరుపేదలకు పంపిణీకి చర్యలు తీసుకోవాలని అన్నారు. మున్నేరు వాగు నుండి లిఫ్ట్ లేకుండా, గ్రావిటీ తో సీతారామ ప్రాజెక్టుకు నీరు వెళుతుందా, ప్రణాళిక చేయాలన్నారు. పాలేరు లింక్ కెనాల్ కు సంబంధించి, భూసేకరణకు, రైతులతో మాట్లాడతానని, పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు చేపట్టాలని అన్నారు. రోడ్లు, భవనాల శాఖ ద్వారా నియోజకవర్గ పరిధిలో 5 కాలనీల్లో 97 గృహ నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నట్లు, 2 కాలనీల్లో సంక్రాంతి లోగా పూర్తయే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటికి కేటాయించిన డబల్ బెడ్ రూం ఇండ్లు, గ్రామ సభ ద్వారా, లాటరీ ద్వారా, ఏ ప్రాతిపదికన కేటాయించింది నివేదిక సమర్పించాలన్నారు. తహశీల్దార్లు ఇప్పటికి జారీచేసిన పొజిషన్ సర్టిఫికెట్లు, పాస్ బుక్ లు పునః పరిశీలించి తప్పులు జరిగితే సరిదిద్దాలన్నారు. అన్యాక్రాంతం అయిన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని, రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఆర్డీవోలు ఇట్టి విషయాల్లో పర్యవేక్షణ చేయాలన్నారు. వైద్యానికి సంబంధించి పాలేరు నియోజకవర్గంలో ఎన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ఎంతమంది సిబ్బంది ఉన్నది, ఎంత మంది ఖాళీలు ఉన్నవి నివేదిక ఇవ్వాలన్నారు. వైద్యాధికారులు క్షేత్ర స్థాయిలో విధులకు హాజరు అవుతున్నది, పనిచేయు స్థలంలో ఉంటున్నది నివేదిక ఇవ్వాలన్నారు. 7/24 వైద్యాధికారులు అందుబాటులో ఉండేలా, ప్రభుత్వ వైద్యశాలలపై ప్రజలకు నమ్మకం కల్గేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. డయాలసిస్ రోగులు నియోజకవర్గంలో ఎంతమంది ఉన్నది తెలపాలని, వైద్య విషయంలో పాలేరు ను ఆదర్శంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం గ్రామాల్లో బెల్ట్ షాపులు లేకుండా చూడాలన్నారు. నియోజకవర్గ పరిధిలో నగరానికి చుట్టుపక్కల జరిగిన రిజిస్ట్రేషన్లను పరిశీలించాలని, నిబంధనల మేరకు పనులు జరగాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని తెలిపారు. ఉద్యోగుల ఫ్రెండ్లి ప్రభుత్వమని, ఇబ్బందులు, సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. ఉద్యోగులు ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని, పాలసీలపై ఇన్ పుట్ ఇవ్వాలని, సమిష్టి గా పనిచేస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. ఆర్థిక వ్యవస్థను అతికొద్ది రోజుల్లో గాడిలోకి తెస్తామని, వేతనాలు 1-5వ తేదీలోగా ఇచ్చేలా చర్యలు చేపడతామని అన్నారు. ప్రారంభమయి 50 శాతానికి పైగా పురోగతిలో ఉన్న పనులను పూర్తి చేయాలని, మంజూరయిన పనులు పునః సమీక్షించి, ప్రాధాన్యత ప్రకారంగా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. కుటుంబ సభ్యులుగా కలిసి పనిచేస్తామని, ప్రభుత్వం మీద ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయమని, రెవిన్యూ, భూ, అనేక సెక్టార్లలో సంస్కరణలు తెస్తామని, అందరం కలిసి ప్రజలకు మంచి చేసినదే నిజమైన పరిపాలన అని మంత్రి తెలిపారు. ఈ సమీక్ష లో జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్, పోలీస్ కమీషనర్ విష్ణు ఎస్. వారియర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, అదనపు డిసిపి ప్రసాద రావు, జిల్లా అధికారులు, డివిజన్, పాలేరు నియోజకవర్గ మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి పోటెత్తిన జనం... భూ సమస్యలే అధికం

**- మొత్తం 5126 దరఖాస్తులు**

**- ఆటో డ్రైవర్ల మొర ఆలకించిన సర్కారు : మంత్రి పొన్నం గుడ్ న్యూస్**



**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** ప్రజాసమస్యలపై దరఖాస్తులు స్వీకరి ంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభ వన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణికి జనం పోటెత్తారు. కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. ప్రజావాణికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై వారి వినతులను పరిశీలించారు. కిలోమీటరు దూరం వర కు బారులు తీరిన అర్జీదారులు, తమ సమస్యలపై అధికారులకు ఫిర్యాదులు అందజేశారు. పింఛన్లు, ఇల్లు, ఉద్యోగాలు, రవాణా రంగంలో బిల్లులు తగ్గించాలనే వినతులతో పెద్దఎత్తున జనాలు రావడంతో ప్రజాభవన్ ముందు భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనాలను క్రమబద్ధీకరించిన పోలీసులు అర్జీదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.అధిక శాతం ఫిర్యాదులు ధరణి పోర్టల్ వల్ల తమ భూములు పోయాయని, సిట్టింగ్ ఎంఎల్‌ఎలు తమ భూములు ఖబ్జా చేశారని, టిఎస్‌పిఎస్‌సిపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలి అంటూ ప్రభుత్వాన్ని వేడుకున్నవే ఉన్నట్లు సమాచారం. గత ప్రభుత్వం పరిష్కారం చూపని ప్రజల సమస్యలను ఈ ప్రభుత్వమైనా పరిష్కరిస్తుందన్న నమ్మకంతో వినతి పత్రాలతో ప్రజావాణికి వస్తున్నామని అర్జీదారులు చెబుతున్నారు. చాలా ఏళ్లుగా స్పౌజ్ బదిలీలపై ఉద్యోగులు అనేక ధర్నాలు, ర్యాలీలు చేపట్టినా సమస్య తీరకపోవడంతో ప్రజావాణికి వచ్చామని తెలిపారు. ఈ సర్కారైనా తమ సమస్యలు పరిష్కరిస్తుందని ఆశిస్తున్నామని వెల్లడించారు.

### అర్జీదారుల సమస్యల పరిష్కరించటానికి ప్రభుత్వం ప్రాధాన్యత : పొన్నం

అర్జిదారుల సమస్యలను పరిష్కరించటానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ప్రజావాణికి వచ్చిన ప్రతి ఒక్కరి సమస్యను తెలుసుకుని , వారి అర్జీలను తీసుకున్నారు. ప్రతి అర్జికి ఒక నంబర్‌ను కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే అర్జిదారుల రిఫరెన్స్ కొరకు వారి సెల్ ఫోన్ నంబర్‌కు సంక్షిప్త సందేశం పంపుతున్నట్లు వెల్లడించారు. మంగళవారం నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమంలో 5324 వినతి పత్రాలు అందాయి. అందులో 55 శాతం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, 30 శాతం పెన్షన్‌లకు సంబంధించిన వినతి పత్రాలే ఉన్నాయి. మిగిలినవి ఉద్యోగాలు, రెవెన్యూ సమస్యలు మొదలైనవి అని ప్రజా భవన్ అధికార వర్గాలు తెలియజేశాయి.

### ఆటో డ్రైవర్లను ఆదుకుంటాం: పొన్నం

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మీ పథకాన్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. మహిళలకు ఉచిత ఆర్టీసీ రవాణా సదుపాయాన్ని డిసెంబర్ 9వ తేదీ నుంచే అమల్లోకి తెచ్చింది. ఆటో డ్రైవర్లు బాధపడవద్దని, వారు కూడా తమ సోదరు లేనని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. కొంచెం ఓపిక పట్టాలని కోరారు. మహాలక్ష్మీ పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణ సదుపా యాన్ని కల్పించడం వల్ల ఆటో డ్రైవర్లు సమస్య ఎదుర్కొంటు న్నారని, ఈ సమస్య తమ దృష్టికి వచ్చిందని మంత్రి పొన్నం అన్నారు.

### అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలి : ఎన్.బాలమల్లేష్

తెలంగాణలో అగ్రిగోల్డ్ సంస్థల ఆస్తులను ప్రభుత్వం స్వాధీ నం చేసుకొని అగ్రిగోల్డ్ బాధితులకు డబ్బులు చెల్లించి, వారిని ఆదుకో వాలని అగ్రిగోల్డ్ బాధితుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.బాలమల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం ఆధ్వర్యంలో ప్రజాభవన్‌లో ప్రజావాణిలో బాధితులను తీసుకొని అధికారులను కలిసి అగ్రిగోల్డ్ బాధితుల సమస్యంలను పరిష్కరించాలని అర్జిని ఇచ్చాయి.

### ప్రజావాణి ఆన్‌లైన్ పోర్టల్

ప్రజా సమస్యలపై దరఖాస్తులు స్వీకరించేందుకు తెలంగాణ ప్రభు త్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులకు పరిష్కారం ఏ దశలో ఉందో తెలుసుకునేందుకు ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటు లోకి తీసుకు వచ్చింది. ఈ పోర్టల్‌లో ప్రజావాణిలో ఫిర్యాదు సందర్భంగా ప్రభు త్వం నుంచి రిఫరెన్స్ నెంబర్ ప్రకారం తమ అప్లికేషన్ స్టేటస్ తెలు సుకునే వెసులుబాటు కల్పించింది. ప్రజావాణిని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ ప్రోగ్రామ్‌కు మంత్రులు హాజరుకావాలని ఆదేశించింది. ప్రజావాణి నోడల్ అధికారిగా ఐఎఎస్ అధికారి హరిచందనను నియమించిన తెలిసిందే.

# విద్యుత్ ఉద్యోగులు స్వేచ్ఛగా సమస్యలను చెప్పవచ్చు: మల్లురవి



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** విద్యుత్తు ఉద్యోగులు స్వేచ్ఛగా తమ సమస్యలను యాజమాన్యాలకి, ఈ ప్రభుత్వాలకు తెలియచేసే దిశగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని మాజీ పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి అన్నారు. మంగళవారం మింట్ కంపౌండ్‌లో జరిగిన 1104 విద్యుత్ యూనియన్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక సమస్యల పరిష్కారంలో చట్టాలకు లోబడి నిబంధనలకు అనుగుణంగా మీ పంథాలో మీరు కొనసాగాలన్నారు.. ప్రభుత్వానికి కూడా సంపూర్ణ సహాయ సహకారాలు అందించి ప్రజా ప్రభుత్వానికి మద్దతుగా నిలిచి విద్యుత్ రంగం పురోగతిలో భాగస్వాములు కావాలన్నారు.ఎన్నో ఆశలతో అనేక ఉద్యమాలు చేసి సాధించుకున్న తెలంగాణలో కార్మిక సంఘాలను అనిచివేచే ధోరణిలో గత ప్రభుత్వాలు వ్యవహరించినాయని అందుకు తగిన మూల్యం చెల్లించుకుని ప్రతిపక్ష పాత్రకు పరిమితమైనట్లు తెలిపారు. యూనియన్ ప్రదాన కార్యదర్శి జి. సాయిబాబా మాట్లాడుతూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పై మాకు సంపూర్ణ విశ్వాసం ఉందని విద్యుత్ అమెండ్‌మెంట్ బిల్లు విషయంలో ఫిబ్రవరి జరిగే జాతీయస్థాయి కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులను ఆహ్వానించే దిశగా ఆలోచన చేస్తున్నామన్నారు. విద్యుత్ రంగ పరిరక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి యూనియన్ సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తుందని, ఈ రంగాన్ని కాపాడుకోవడానికి ఎంత దూరం వెళ్ళటానికైనా 1104 యూనియన్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, సలహాదారులు జనార్దన్ రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, సీనియర్ నాయకులు, టిఎస్ఎస్‌పిడిసీఎల్, ఎన్‌పిడిసిఎల్, ట్రాన్స్‌కో,జెన్‌కో కంపెనీల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

## మంత్రి దామోదర రాజనర్సింహకు నర్సింగ్ అసోసియేషన్ ధన్యవాదాలు

**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** రాష్ట్రంలో 7,094 స్టాఫ్ నర్సు పోస్టుల పరీక్ష ఫలితాలు విడుదలైన సందర్భంగా రిజిస్టర్ నర్సింగ్ ఆఫీసర్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి ధన్యవాదాలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ అధ్యక్షురాలు సుజాత రాథోడ్, నర్సింగ్ ఆఫీసర్లు లక్ష్మణ్ రూడవత్, సోమేశ్, రవి నాయక్, హరిత,సౌమ్య ఉన్నారు.



# ఏపీ బరితెగింపు.. దొంగ రాత్రి రాయలసీమ లిఫ్ట్ నిర్మాణం

- ఎన్జీటీ ఆదేశాలు బేఖాతర్
- దొడ్డిదారిన రాయలసీమ లిఫ్ట్ నిర్మాణం
- నెలరోజులుగా ఫ్లడ్‌లైట్ల వెలుగులో పనులు
- గుట్టుచప్పుడు కాకుండా నిర్మాణం ముమ్మరం
- పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ విస్తరణ కూడా..
- తెలంగాణలో ఎన్నికలే అదనుగా తంపులాటకు..
- మరోవైపు సాగర్ డ్యామ్ కుడికాలువ ఆక్రమణ
- ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్ ఆధీనంలోనే లెఫ్ట్ కెనాల్



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** ఎన్నికల హడావుడి, కొత్త ప్రభుత్వం ఏర్పాటు తదితర అంశాల్లో తెలంగాణ నిమగ్నమై ఉండగా, ఏపీ ప్రభుత్వం ఇదే అదనుగా అక్రమాలకు తెగబడుతున్నది. పోలింగ్‌కు ముందురోజే ఒకవైపు నాగార్జునసాగర్ డ్యామ్‌ను సాయుధబలగాలతో ఆక్రమించుకొన్న విషయం తెలిసిందే. అదీగాక మరోవైపు గుట్టుచప్పుడు కాకుండా రాయలసీమ ఎత్తిపోతల పథకం, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ విస్తరణ పనులను ముమ్మరంగా కొనసాగిస్తున్నది. కేంద్ర జల్‌శక్తిశాఖ ఆదేశాలను, ఎన్జీటీ ఉత్తర్వులను తుంగలో తొక్కి ప్రాజెక్టు పనులను అర్ధరాత్రి వేళ ఫ్లడ్‌లైట్ల వెలుతురులో నిర్వహిస్తున్నది. ఇప్పటికే ఇదే విషయమై తెలంగాణ అనేకమార్లు కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ)కు ఫిర్యాదు చేసింది. అయినప్పటికీ కేఆర్ఎంబీ నుంచి ఎలాంటి స్పందన లేకుండాపోయింది.

### ఎన్జీటీ ఉత్తర్వులు ఉల్లంఘించి..

ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం కృష్ణా బోర్డు, అపెక్స్ కౌన్సిల్ అనుమతి తర్వాత కొత్త ప్రాజెక్టు చేపట్టాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా శ్రీశైలం జలాశయం నుంచి రోజుకు 3 టీఎంసీల నీటిని ఎత్తిపోసే రాయలసీమ ఎత్తిపోతల, 80వేల క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యం పోతిరెడ్డి విస్తరణ పనులకు రూ.6,829.15 కోట్లతో 2020 మే ఐదో తేదీన 203 జీవోను ఏపీ సర్కారు జారీ చేసింది. ముఖ్యంగా కృష్ణా బేసిన్‌లోని తెలంగాణ ప్రాజెక్టులకు నష్టం వాటిల్లేలా.. చట్టాన్ని ఉల్లంఘిస్తూ చేపడుతున్న ఈ కొత్త ప్రాజెక్టు ద్వారా పెన్నా బేసిన్‌కు కృష్ణాజలాలను తరలించనున్నారు. అదేరీతిన 15.07.2020న పెన్నా బేసిన్‌లో కాల్వల సామర్థ్య పెంపు పనులకు రూ.1415 కోట్లతో చేపట్టేందుకు జీవో 388 ద్వారా పాలనా అనుమతులు కూడా ఇచ్చింది. ఈ నేపథ్యంలో కృష్ణాబోర్డు, కేంద్రానికి అనేకసార్లు తెలంగాణ ప్రభుత్వం ఫిర్యాదు చేయడంతో రాయలసీమ ఎత్తిపోతల పథకంపై ముందుకుపోవద్దని గతంలోనే కేంద్ర జల్‌శక్తి అదేశానుసారం కృష్ణానదీ యాజమాన్య బోర్డు ఏపీకి ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ కేంద్ర ఆదేశాలను బేఖాతరు చేసి ఏపీ టెండర్ల ప్రక్రియను పూర్తి చేసింది. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం కేంద్ర జల్‌శక్తి, పర్యావరణ అనుమతులు లేకుండా రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను చేపడుతున్నదని తెలంగాణకు చెందిన ఒకరు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ)లో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను విచారించిన ఎన్జీటీ ఒక ఉమ్మడి కమిటీని ఏర్పాటు చేసింది. ప్రాజెక్టుకు అనుమతులున్నాయా? లేవా? ప్రాజెక్టు వల్ల ఏపీ, తెలంగాణకు సమన్యాయం జరుగుతుందా? లేదా? శ్రీశైలం జలాలు ఇరు రాష్ట్రాలకు చెందిన అంశమైనందున కేంద్ర జల్‌శక్తి, పర్యావరణ అనుమతులతోపాటు మరేవిధమైన అనుమతులు కావాల్సి ఉంటుందనే అంశాలను కూడా తేల్చి నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ఆ కమిటీ నివేదిక వచ్చేవరకూ ప్రాజెక్టు పనులను చేపట్టవద్దని, ప్రాజెక్టు పనులను చేపట్టేందుకు కావాల్సిన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవచ్చని ఎన్జీటీ తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. దానిని సాకుగా చేసుకొని ఏపీ ప్రభుత్వం ఏకంగా టెండర్లను ఖరారు చేయడంతోపాటు భారీ యంత్రాలు, వేలాదిమంది కార్మికులతో యుద్ధప్రాతిపదికన ప్రాజెక్టు పనులనే ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ఏపీ సర్కారు ఉద్దేశపూర్వకంగా ఎన్జీటీ ఉత్తర్వులను బేఖాతరు చేస్తున్నదని, దానిపై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈసారి తెలంగాణ ప్రభుత్వం ఎన్జీటీని ఆశ్రయించింది. అందులో కేంద్ర అటవీ పర్యావరణశాఖ కార్యదర్శి, కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి, ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సభ్య కార్యదర్శులతోపాటు ఎస్‌పీఎంఎల్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ ఎండీలను ప్రతివాదులుగా చేర్చింది. రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను స్వయంగా ఎన్జీటీ బృందమే సందర్శించాలని ప్రత్యేకంగా తెలంగాణ సర్కారు అభ్యర్థించింది. ఈ నేపథ్యంలో వాస్తవాలను తేల్చేందుకు ఎన్జీటీ కేఆర్ఎంబీ ఆధ్వర్యంలో నిపుణుల కమిటీని ఏర్పాటు చేయగా, పనుల విషయంలో ఏపీ ప్రభుత్వం చెబుతున్న విషయాలన్నీ అబద్ధమేనని ఆ కమిటీ నివేదించింది. దీంతో పర్యావరణ అనుమతులు పొందేవరకూ రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులను చేపట్టవద్దని, కనీసం డీపీఆర్ తయారీకోసం కూడా ఎలాంటి తవ్వకాలను, పనులను చేపట్టవద్దని ఎన్జీటీ నొక్కిచెబుతూ ఆదేశాలు జారీ చేసింది. నిబంధనలు ఉల్లంఘించి పనులు చేపడితే అందుకు ఏపీ ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వానికి 2021 డిసెంబర్‌లో ఎన్జీటీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే కొద్దిరోజులపాటు స్తబ్ధుగా ఉన్న ఏపీ సర్కారు తెలంగాణ ఎన్నికల్లో నిమగ్నమైన సమయాన్ని అదునుగా తీసుకుని కొద్దిరోజుల నుంచి ప్రాజెక్టు పనులను మళ్లీ ముమ్మరం చేసింది. ఎన్జీటీ ఉత్తర్వులను తుంగలో తొక్కి మరీ పనులు చేస్తున్నది.

### అర్ధరాతి వేళ జోరుగా లైనింగ్ పనులు..

ఏపీ ప్రభుత్వం డీపీఆర్ తయారీకోసమంటూ ఏకంగా ప్రాజెక్టు పనులనే గతంలో చాలా వరకు పూర్తి చేసింది. కేంద్ర జల్‌శక్తి మార్గదర్శకాల (2010) ప్రకారం డీపీఆర్ తయారీ కోసం చేపట్టాల్సిన పనులకన్నా ఎన్నోరెట్ల స్థాయిలో పనులు జరిగాయని ఎన్జీటీ నియమించిన కమిటీనే స్వయంగా ఫొటోలతో సహా గతంలోనే నివేదించింది. రాయలసీమ ఎత్తిపోతల పథకంలో భాగంగా శ్రీశైలం రిజర్వాయర్ 800 ఫీట్ల నుంచి 8.8 కిలోమీటర్ల అప్రోచ్ చానల్‌ను తవ్వాల్సి ఉండగా, నివేదిక సమర్పించేనాటికే ఆ పనులన్నీ పూర్తయ్యాయి. ఫోర్‌బే ప్రాంతానికి, అప్రోచ్ చానల్‌కు మధ్య కేవలం 15 మీటర్ల తవ్వకం పనులు మాత్రమే మిగిలి ఉందని తెలిపింది. అదేవిధంగా అప్రోచ్‌చానల్ ఫోర్‌బేను ఇక 237 మీటర్ల పొడవుతో నిర్మించాల్సి ఉండగా అ పనులన్నీ కూడా పూర్తయ్యాయి. ఫోర్‌బే లోతు 150 నుంచి 180 మీటర్ల వరకు ఉంటుందని, ఫోర్‌బే గోడలకు సంబంధించి ఇరుపక్కల షాట్‌క్రీటింగ్ పనులు కూడా మొదలయ్యాయని, ప్రాజెక్టులో భాగంగా 250 మీటర్ల పొడవు, 40 మీటర్ల వెడల్పుతో, 730 ఫీట్ల లోతుతో ఏర్పాటు చేయాల్సిన పంప్‌హౌస్‌కు సంబంధించిన తవ్వకాలన్నీ పూర్తయ్యాయని, మొత్తంగా 12 పైప్‌లైన్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా అందులో ఇప్పటికే 10 పైప్‌లైన్ల కోసం 5 మీటర్ల వ్యాసార్థంతో 35 నుంచి 50 మీటర్ల వరకు తవ్వకాలు పూర్తయ్యాయని, షాట్‌క్రీటింగ్ పనులు కూడా మొదలయ్యాయని, డెలివరీ సిస్టర్న్ నిర్మాణానికి సంబంధించిన తవ్వకాలన్నీ పూర్తయ్యాయని, అక్కడి నుంచి శ్రీశైలం కుడి ప్రధాన కాలువను కలుపుతూ సుమారు 500 మీటర్ల లింక్ కెనాల్‌ను సైతం తవ్వారని వెల్లడించింది. కాంక్రీట్ పనుల కోసం ప్రాజెక్టు సైట్‌లో రెడ్ సిమెంట్ మిక్సింగ్ ప్లాంట్లను ఏర్పాటు చేశారని, కంకర, ఇసుకను కూడా ఇప్పటికే సిద్ధం చేశారని ఆ కమిటీ తెలపడం గమనార్హం. ప్రస్తుతం ఎన్జీటీ ఆదేశాలను ఉల్లంఘించి గత కొద్దిరోజులుగా మిగిలిపోయిన ప్రాజెక్టు పనులను ఏపీ ప్రభుత్వం ముమ్మరం చేసింది. అర్ధరాత్రి వేళ సైతం పనులను నిరాటంకంగా కొనసాగిస్తున్నదని తెలుస్తున్నది.

### రెండేండ్లయినా జాడలేని నివేదిక!

కేంద్ర పర్యావరణశాఖ నుంచి అనుమతులను పొందేవరకూ రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులను చేపట్టవద్దని, కనీసం డీపీఆర్ తయారీ కోసం కూడా ఎలాంటి తవ్వకాలు చేపట్టరాదని ఏపీ ప్రభుత్వానికి ఎన్జీటీ స్పష్టం చేయడంతోపాటు అప్పటికే చేపట్టిన పనుల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని నిర్ణయించింది. రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టు ప్రతిపాదిత స్థలంలో జరిగిన పనులను, వాటివల్ల పర్యావరణానికి వాటిల్లిన నష్టాన్ని, ఏపీ సర్కారు చేసిన ఖర్చును, తదితర సాంకేతిక అంశాల పరిశీలనకు ప్రత్యేక కమిటీని నియమిస్తూ మార్గదర్శకాలు జారీ చేసింది. జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, కేంద్ర జల సంఘం, కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ అధికారులతో కమిటీని ఏర్పాటు చేయాలని నిర్దేశించింది. నాలుగునెలల్లో ఆ కమిటీ తమ అధ్యయన నివేదికను అందజేయాలని 2021 డిసెంబర్‌లో తన తీర్పులోనే స్పష్టం చేసింది. ఇప్పటికి రెండేండ్లు గడచినా ఆ నివేదిక జాడ లేకుండాపోయింది.

### చోద్యంచూస్తున్న కేఆర్ఎంబీ

రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులపై ఏపీ ప్రభుత్వం ఆది నుంచీ దుందుడుకుగా ముందుకుపోతున్నా కేఆర్ఎంబీ మాత్రం చోద్యం చూస్తున్నది. లిఫ్ట్ పనులకు జీవో జారీ చేసిన నాటి నుంచి తెలంగాణ సర్కారు కేంద్రానికి, బోర్డుకు ఫిర్యాదు చేస్తూనే ఉన్నది. అపెక్స్ కౌన్సిల్ సమావేశంలోనూ పనులపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అయినా కూడా ఏపీ బేఖాతరు చేస్తూనే ఉన్నది. ఎన్జీటీ ఆర్డర్‌ను ఉల్లంఘిస్తూ ఏపీ ప్రభుత్వం రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ఫేజ్ 1 పనులను చేపడుతున్నదని, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ విస్తరణకు పూనుకొన్నదని, శ్రీశైలం రైట్ మెయిన్ కెనాల్ లైనింగ్‌ను పూర్తిచేసిందని, ఇకనైనా వెంటనే ఏపీని నిలువరించాలని, ప్రాజెక్టు పనులను అడ్డుకోవాలని తెలంగాణ సర్కారు డిమాండ్ చేస్తూ బోర్డుకు పదుల సంఖ్యలో లేఖలు రాసింది. అయినప్పటికీ కేఆర్ఎంబీ నుంచి స్పందన కరువైంది. ఇప్పటివరకూ కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. కనీసం ఆ వైపు కన్నెత్తి చూసింది కూడా లేదని తెలంగాణ ఇంజినీర్లు మండిపడుతున్నారు. ఇకనైనా బోర్డు కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## తిరుమలలో వైభవంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తెలంగాణ వీణ/తిరుమల :** డిసెంబరు 23న వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా మంగళవారం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని ఘనంగా నిర్వహించారు. సంవత్సరంలో నాలుగుసార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు మంగళవారం ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం 6 నుంచి ఉదయం 10 గంటల వరకు నిర్వహించిన శుద్ధి కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు. ఆలయంలోని ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను



నీటితో శుభ్రంగా కడిగారు. టీటీడీ చైర్మన్ మాట్లాడుతూ శతాబ్దాల నాటి ఆలయ శుద్ధి, కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనందంగా ఉందని ఆలయంలో దైవత్వాన్ని, తపస్సును చేసినట్లు ఉందని పేర్కొన్నారు. నామకోపు, శ్రీ చూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలంతో ఆలయం అంతటా ప్రోక్షణం చేశామని వివరించారు. తిరుమంజనం సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి 10.30 గంటల వరకు అష్టదళ పాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది.

## చదరంగంలో సత్తా చాటిన ప్రియదర్శిని కళాశాల విద్యార్థి

- ఆలిండియా యూనివర్సిటీకి ఎంపిక
- అభినందించిన కళాశాల అధ్యాపక బృందం




**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:** ఈనెల 18వ తేదీన వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో జరిగిన చదరంగం పోటీలో స్థానిక ప్రియదర్శిని కళాశాల విద్యార్థి బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గణేష్ ప్రథమ స్థానంలో నిలిచి ఆలిండియా యూనివర్సిటీకి ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా గణేష్‌ను మంగళవారం కళాశాలలో కళాశాల డైరెక్టర్ శ్రీరామనేని చలపతిరావు ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ నయీం పాషా ప్రత్యేకంగా అభినందిస్తూ చెన్నైలో జరిగే ఆలిండియా యూనివర్సిటీ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి కాకతీయ యూనివర్సిటీకి చదువుతున్న కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. వైస్ ప్రిన్సిపాల్ రాయల వివేక్ పి.డి కాశిమల్ల రమేష్ అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## నాకు టికెట్ రాదని తప్పుడు ప్రచారం చేస్తున్నారు



**తెలంగాణ వీణ/ఏపీ బ్యూరో :** వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేలలో ఈసారి ఎంత మందికి టికెట్ వస్తుందో? అనే చర్చ పెద్ద ఎత్తున సాగుతోంది. ఇప్పటికే పలువురిని పక్క నియోజకవర్గాలకు మారుస్తూ ముఖ్యమంత్రి జగన్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈసారి దాదాపు 80 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలను జగన్ పక్కన పెట్టబోతున్నారనే ప్రచారం జరుగుతోంది. మంత్రి రోజాకు కూడా ఈసారి టికెట్ ఇవ్వరనే ప్రచారం ఊపందుకుంది. ఈ నేపథ్యంలో రోజా స్పందిస్తూ... తనకు టికెట్ రాదని తప్పుడు ప్రచారం చేస్తూ కొందరు శునకానందం పొందుతున్నారని మండిపడ్డారు. వారి ఆశలు ఫలించవని అన్నారు. ఎన్నికల్లో తాను పోటీ చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

## మైనారిటీల హక్కుల పరిరక్షణకు కృషి

- ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా

**తెలంగాణ వీణ/నంద్యాల ప్రతినిధి:** రాష్ట్రంలోని మైనారిటీల హక్కుల పరిరక్ష ణకు ప్రభుత్వం అహర్నిశలూ కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా అన్నారు. ఆల్ ఇండియా మిల్లి కౌన్సిల్ ఆధ్వర్యంలో ముస్లిం మైనారిటీ హక్కుల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మైనారిటీ హక్కుల పరిరక్షణ, బాధ్యతలపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ సీఎం అంజాద్ బాషా మాట్లాడుతూ మైనారిటీల హక్కులను ప్రజలకు తెలపాలని, వాటిని పరిరక్షించుకునేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలనే ఆలోచనలో భాగంగా ఆలిండియా మిల్లి కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. అన్ని మైనారిటీ వర్గాలను కలుపుకొని రాబోయే రోజుల్లో హక్కుల పరిరక్షణ కోసం పనిచేయాలని సూచించారు. మైనారిటిల పరిరక్షణలో సీఎం జగన్ ముందుంటారని, ఆ విషయంలో ఎవరూ అపోహ పడరాదని, ఎన్ఆర్సి, యుసిసి లాంటి వాటిని రాష్ట్రంలో అమలు చేయబోమని హామీ ఇచ్చినట్లు డిప్యూటీ సిఎం అంజాద్ బాషా వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలిం డియా మిల్లీ కౌన్సిల్ జాతీయ ఉప కార్యదర్శి షా ఖాద్రి ముస్తఫా రిఫాయి జిలాని, రాష్ట్ర కార్యదర్శి మునీర్ అహ్మద్, అధ్యక్షుడు అబ్దుల్ ఖదీర్, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, నంద్యాల జిల్లా కార్యదర్శి జి.ఎం. గౌస్, మిడియా రాష్ట్ర కార్యదర్శి ఎస్. ఉస్మాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.




## హెచ్ 1 బి వీసా రెన్యూవల్ ఇకపై అమెరికాలోనే...




**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ:** అగ్రరాజ్యం అమెరికాలో హెచ్ 1 బి వీసాతో ఉద్యోగం చేస్తున్న భారత సంతతి పౌరులకు భారీ ఊరట లభించనుంది. ఇకపై హెచ్ 1 బి వీసా రెన్యూవల్ కోసం ఇండియాకు రావాల్సిన అవసరం లేకుండా అమెరికా చర్యలు చేపట్టింది. వీసా నిబంధనలలో మార్పులు చేసింది. అమెరికాలోనే ఈ వీసాలను రెన్యూవల్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తోంది. పైలట్ ప్రాజెక్టుగా 20 వేల హెచ్ 1 బి వీసాలను రెన్యూవల్ చేసే ప్రక్రియకు అమెరికా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వచ్చే ఏడాది జనవరిలో ఈ ప్రక్రియను అమలులోకి తీసుకు వచ్చేందుకు అక్కడి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో అమెరికాలోని భారత సంతతి ఉద్యోగులకు ఊరట లభించను ంది. ఈవీసా రెన్యూవల్ కు సంబంధించి విధివిధానాలపై ప్రస్తుతానికి స్పష్టత లేదని, ఎవరు అర్హులనే విషయం ఫెడరల్ రిజిస్టర్ నోటీసు విడుదలయ్యాకే తెలుస్తుందని బ్లూమ్ బర్గ్ లా వెల్లడించింది. ఈ ప్రాసెస్ కు సంబంధించి వైట్ హౌస్ యంత్రాంగం ఈ నెల 15న చర్చించి ఆమోదం తెలిపింది. హెచ్ 1 బి వీసా రెన్యూవల్ కోసం వీసా హోల్డర్లు ఒక్క మెయిల్ చేస్తే సరిపోతుందని అధికారులు తెలిపారు. గతంలో వీసా రెన్యూవల్ కోసం హెచ్ 1 బి హోల్డర్లు అమెరికా దాటి వెళ్లాల్సి వచ్చేది.

## దావూద్ ఇబ్రహీం చచ్చిపోయాడా?: ఛోటా షకీల్ ఏం చెప్పాడంటే!



**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ:** పాకిస్థాన్‌లో ఉంటున్న అండర్ వరల్డ్ డాన్, ఇండియాకు మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ దావూద్ ఇబ్రహీంపై విషప్రయోగం జరిగిందనే ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఆయన చనిపోయారనే వార్తలు కూడా వచ్చాయి. ఈ ప్రచారంపై దావూద్ సన్నిహితుడు ఛోటా షకీల్ స్పందిస్తూ... ఇదంతా తప్పుడు ప్రచారం అని చెప్పాడు. వెయ్యి శాతం ఆరోగ్యంగా, ఫిట్ గా దావూద్ ఉన్నారని తెలిపాడు. దావూద్ పై క్రమం తప్పకుండా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించాడు. ఇటీవలే పాకిస్థాన్ లో దావూద్ ను తాను కలిశానని చెప్పాడు. ఓ జాతీయ మీడియి సంస్థతో మాట్లాడుతూ ఆయన ఈ మేరకు స్పష్టతనిచ్చారు.

## ఐడిఎఫ్‌సి, ఐడిఎఫ్‌సి ఫైనాన్షియల్ హెూల్డింగ్ విలీనానికి ఆర్‌బిఐ ఆమోదం




**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ :** ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్, ఐడిఎఫ్‌సి విలీ నానికి విలీనానికి ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) ఆమోదం తెలిపింది. స్టాక్ మార్కెట్‌కు ఇచ్చిన సమాచారం ప్రకారం, డిసెంబర్ 18న బ్యాంక్ ఆర్‌బిఐ నుండి విలీనానికి ఆమోదం లభించింది. గతంలో కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా కూడా ఈ విలీనానికి ఆమోదం తెలిపింది. సిసిఐ ప్రకారం, ఈ విలీనంలో నిర్ణయించిన నిష్పత్తి 155:100గా ఉంది. ఐడిఎఫ్‌సి 100 షేర్లకు బదులుగా ఐడిఎఫ్‌సి బ్యాంక్ మొత్తం 155 షేర్లను పొందబోతోంది. ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్‌లో ఐడిఎఫ్‌సికి మొత్తం 39.93 శాతం వాటా ఉంది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ తర్వాత ఇది రెండో అతిపెద్ద విలీన ఒప్పందంగా నిలిచింది.

# చర్చ లేకుండా కీలక చట్టాలను ఆమోదించుకోవడం కోసమే సస్పెన్షన్

**- కాంగ్రెస్ తీవ్ర విమర్శ**



**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ:** పార్లమెంటులో పెద్ద సంఖ్యలో విపక్ష సభ్యులను సస్పెండ్ చేయడంపై కాంగ్రెస్ తీవ్రస్థాయిలో మండిపడింది. సభల్లో అర్థవంతమైన చర్యల లేకుండా చట్టాలను ఆమోదించుకునేందుకే ఈ సస్పెషన్ అంటూ వ్యాఖ్యానించింది. ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయాలనుకుంటోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. ప్రతిపక్షాలు మాట్లాడడం దేశ ప్రజలు వినకూడదని ప్రభుత్వం కోరుకుంటోందని, అందుకే సస్పెండ్ చేయడం, బయటికి గెంటేయడం అనే విధానాన్ని అనుసరిస్తోందని మండిపడ్డారు. 'పార్లమెంటునుంచి మొత్తం 141 మంది ప్రతిపక్ష ఎంపిలను సస్పెండ్ చేయడం ఈ నియంతృత్వ బిజెపి ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయాలనుకుంటోందన్న మా ఆరోపణకు బలం చేకూరుస్తోంది. పౌర హక్కులను హరించి వేసి, తిరుగులేని అధికారాలను కట్టబెట్టే క్రిమినల్ చట్ట సవరణలు లాంటి కీలక బిల్లులు సభలో చర్చకు రానున్నాయన్న విషయం మనందరికీ తెలిసిందే. ఈ బిల్లులపై చర్చ జరిగేటప్పుడు ప్రతిపక్షాల మాట్లాడడాన్ని ఈ దేశ ప్రజలు వినకూడదని మోడీ ప్రభుత్వం కోరుకుంటోంది. అందుకనే వాళ్ల ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసేందుకు ఈ సస్పెన్షన్ల నాటకానికి తెరదీశారు' అని ఖర్గే ఓ ట్వీట్‌లో ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. పార్లమెంటులో తీవ్రమైన భద్రతా వైఫల్యంపై హెూంమంత్రి ప్రకటన చేయాలని, దానిపై చర్చ జరపాలన్న తమ డిమాండ్‌లో ఎలాంటి మార్పూ లేదని కూడా ఆయన స్పష్టం చేశారు. లోక్‌సభలోకి ఇద్దరు చొరబడడానికి వీలు కల్పించిన బిజెపి ఎంపి నిర్దోషిగా బయటపడడం కోసమే అధికార బిజెపి ఇదంతా చేస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ సైతం ఓ ట్వీట్‌లో దుయ్యబట్టారు.

# స్వాతంత్ర్య యోధులే స్ఫూర్తిగా పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యానికి కుట్ర

**- భగత్ సింగ్, ఆజాద్ పేరిట వాట్సప్ గ్రూపుల ఏర్పాటు**

**- తరచు చాటింగ్‌లు..వ్యూహ రచనపై నిందితుల చర్చలు**

**- డ్యూప్లికేట్ సిమ్ కార్డుల కోసం పోలీసుల యత్నాలు**



**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ:** పార్లమెంట్ భద్రతా వైఫల్యం కేసులో పోలీసులు అరెస్టు చేసిన ఆరుగురు నిందితులు స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్ పేరిట ఏర్పాటు చేసుకున్న అరడజను వాట్సప్ గ్రూపులలో సభ్యులని పోలీసు వర్గాలు మంగళవారం వెల్లడించాయి. ఈ ఆరుగురు నిందితులతోపాటువాట్సప్ గ్రూపులోని ఇతర సభ్యులు స్వాతంత్ర్య సమరయోధుల ఆలోచనలు, సిద్ధాంతాలను తరచు చర్చించుకునేవారని, వీడియో క్లిప్‌లను కూడా షేర్ చేసుకునేవారని ఈ కేసు దర్యాప్తు అధికారులకు సన్నిహితులైన వర్గాలు తెలిపాయి. డిసెంబర్ 13న పార్లమెంట్‌లో తీవ్ర భద్రతా వైఫల్యం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. సాగర్ శర్మ, మనోరంజన్ డి అనే ఇద్దరు వ్యక్తులు లోక్‌సభ విజిటర్స్ గ్యాలరీలోకి ప్రవేశించి జీరో అవర్ జరుగుతున్న సమయంలో అక్కడి నుంచి సభ్యుల ఛాంబర్‌పైకి దూకారు. ఆ తర్వాత నినాదాలు చేస్తూ స్మోక్ బాంబులను ప్రయోగించారు. వారిని ఎంపీలు నిర్బంధించి పోలీసులకు అప్పగించారు. అదే సమయంలో అమోల్ షిండే, నీలమ్ అనే మరో ఇద్దరు వ్యక్తులు పార్లమెంట్ ప్రాంగణం వెలుపల తానాషాహీ నహీ చలేగీ(నియంతృత్వం సాగదు) అంటూ నినాదాలు చేస్తూ స్మోక్ బాంబులను ప్రయోగించారు. ఈ ఘటనకు ప్రధాన సూత్రధారిగా అనుమానిస్తున్న లలిత్ ఝూతోపాటు మహేష్ కుమావత్ అనే మరో ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులు అందరిపై కఠినమైన చట్ట వ్యతిరేక కార్యకలాపాల(నిరోధక) చట్టం(యుఎపిఎ) కింద పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ పోస్టులను గమనిస్తే వారు విప్లవ నాయకుల నుంచి స్ఫూర్తిని పొందినట్లు అర్థమవుతోందని, పార్లమెంట్‌లో భగత్ సింగ్ చేసిన సాహస కృత్యాన్నే తాము కూడా చేయాలని వారు భావించి ఉంటారని వర్గాలు తెలిపాయి. ఈ వాట్సప్ గ్రూపులకు చెందిన సభ్యుల పేర్లు, వారు చాట్ చేసిన వివరాలను మేటా నుంచి పోలీసులు సంపాదించినట్లు వర్గాలు చెప్పాయి.

### మైసూరులో ముందుగానే కలిసిన నిందితులు

పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యం సృష్టించడానికి సంబంధించిన వ్యూహాన్ని సిగ్నల్స్ యాప్ ద్వారా నిందితులు చర్చించుకున్నారని, గత ఏడాది కర్నాటకలోని మైసూరులో వారంతా కలుసుకున్నారని వర్గాలు వెల్లడించాయి. మైసూరుకు చెందిన మనోరంజన్ డి ఈ ఐదుగురి ప్రయాణ ఖర్చులు భరించాడని ఒక అధికారి తెలిపారు. రాజస్థాన్‌లో లలిత్ ఝూ, కుమావత్ కాల్చివేసిన నలుగురు నిందితుల సెల్‌ఫోన్లకు సంబంధించిన డూప్లికేట్ సిమ్ కార్డుల కోసం పోలీసులు ప్రయగ్నిస్తున్నారు. ఇలా ఉండగా గత శనివారం సిఆర్‌పిఎఫ్ డైరెక్టర్ జనరల్ అనీష్ దయాళ్ సింగ్ సారథ్యంలోని దర్యాప్తు కమిటీ పార్లమెంట్ భద్రత, ఢిలీ పోలీసు అధికారుల సమక్షంలో నేర దృశ్యాన్ని మరోసారి ఆవిష్కరించింది. భద్రతా వైఫల్యానికి గల కారణాలపై దర్యాప్తు జరుపుతున్న కమిటీ లోపాలను గుర్తించి తదుపరి చర్యలను సిఫార్సు చేయనున్నది. యుఎపిఎ చట్టం కింద కేసు నమోదు చేసిన ఢిల్లీ పోలీసులకు చెందిన ప్రత్యేక విభాగం కూడా ఈ కేసును దర్యాప్తు చేస్తోంది.

# కాంగ్రెస్ ' క్రౌడ్ ఫండింగ్ క్యాంపెైన్ 'కు రాహుల్ విరాళం



**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంగళవారం పార్టీ క్రౌడ్ ఫండింగ్ క్యాంపైన్‌కు విరాళం అందించారు. ఈ విరాళం "మైత్రీపూర్వక, ప్రగతిశీల"దేశానికి అని పేర్కొన్నారు. అందరూ ఈ ఉద్యమంలో పాలుపంచుకోవాలని ఆయన ఎక్స్ పోస్ట్ ద్వారా విజ్ఞప్తి చేశారు. దేశం కోసం దానం ( డొనేట్ ఫర్ దేశ్ ) క్యాంపైన్‌కు ఆయన విరాళం అందిస్తున్నట్టు కూడా వీడియో షేర్ చేశారు. అయితే ఎంత తాను విరాళంగా ఇచ్చిందీ వెల్లడించలేదు. పార్టీకి ఎంత విరాళం వస్తుందని పార్టీ కోశాధికారి అజయ్ మకేన్‌ను అడిగారు. కచ్చితంగా ఇంత అనీ ఏదీ నిర్ణయించలేదని, అయినా అనుకున్నదానికన్నా ఎక్కువే వస్తుందని మకేన్ వివరించారు. సంస్థల వారీ కాకుండా రాష్ట్రాల వారీ నిధులు వసూలు చేస్తున్నట్టు చెప్పారు. ఇప్పటివరకు మహారాష్ట్ర నుంచి భారీ ఎత్తున విరాళాలు సేకరించడమైందని, తరువాత స్థానాల్లో రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ ఉన్నాయని అజయ్ మకేన్ వివరించారు. డొనేట్ ఫర్ దేశ్ అనే క్రౌడ్ ఫండింగ్ క్యాంపైన్‌ను కాంగ్రెస్ సోమవారం ప్రారంభించింది. పార్టీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే తన మొదటి విరాళాన్ని అందజేశారు.

# పార్లమెంట్ ఎన్నికల్లో పొత్తుల కోసం కాంగ్రెస్ అలయన్స్ కమిటీ



**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ :** వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి అధికార పార్టీ బీజేపీని ఎదుర్కొనేందుకు ఇతర పార్టీలతో పొత్తులపై చర్చలు జరిపేందుకు వీలుగా ఐదుగురు సభ్యులతో కాంగ్రెస్ మంగళవారం నేషనల్ అలియన్స్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి కాంగ్రెస్ సీనియర్ నేత ముకుల్ వాస్నిక్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఈ నేషనల్ అలియన్స్ కమిటీకి రాజస్థాన్ మాజీ సిఎం అశోక్ గెహ్లాట్, ఛత్తీస్‌గఢ్ మాజీ సిఎం భూపేష్ బఘేల్, మాజీ కేంద్ర మంత్రి సల్మాన్ ఖుర్షీద్, సీనియర్ నేత మోహన్ ప్రకాష్ సభ్యులుగా ఉంటారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఈ నేషనల్ అలియన్స్ కమిటీని ఏర్పాటు చేశారని తక్షణం ఇది అమలు లోకి వస్తుందని పార్టీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇతర పార్టీలతో పొత్తుల విషయమై అన్ని అంశాలను ఈ కమిటీ పరిశీలిస్తుందని పేర్కొంది.

## ఆటో డ్రైవర్లకు ఆర్థిక సహాయం అందించాలి: ఎమ్మెల్యే బీఎల్ఆర్




**తెలంగాణ వీణ/కాప్రా:** ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. మంగళవారం కాప్రా ప్రెస్‌క్లబ్‌లో ఆటోయూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశం ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రభుత్వం మహిళాలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం వల్ల ఆటో డ్రైవర్లకు కుటుంబ పోషణ భారంగా మారిందనీ, వారి ఉపాధికి ప్రభుత్వం భరోసా కలిపించాలన్నారు. మహిళాలకు ఉచిత ప్రయాణం అందిస్తూనే ఆటో డ్రైవర్ల ఉపాధి కొసం ప్రభుత్వం నెలకు రూ. 10వేల ఆర్థిక సహాయం అందించాలన్నారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కారాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఆటొ డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకొకపోతే ఆత్యహాత్యలే శరణ్యమని ఆటొయూనియన్ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు.

## మామిడి, చింత చెట్లు లీజుకు వేలం



**తెలంగాణ వీణ/శామీర్‌పేట:** మామిడి, చింత చెట్లు లీజుకు వేలం వేయనున్నట్లు శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఈ వో శ్రీనివాసరావు, చైర్మన్ మైసయ్య మంగళవారం తెలిపారు. కేశవరం గ్రామ పరిధిలోని సర్వే 81 నెంబర్ లో గల 7 : 30 గుంటల భూమిలో గల 370మామిడి చెట్లు, 25 చింత చెట్లు ఒక సంవత్సరం లీజుకు వేలం వేయడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తిగలవారు ఈ నెల 21 వ తేది 10:30 గంటలకు కేశవరం లోని దేవాలయం వద్ద హాజరు కావాలని కోరారు. వేలం పాటలో పాల్గొనే వారు దేవాదయ శాఖకు రూ 2 వేలు ముందుగా చెల్లించి పాటలో పాల్గొనాలని సూచించారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ



**తెలంగాణ వీణ/కాప్రా:** కాప్రా సర్కిల్ జై జవాన్ కాలనీలో జ్యోతిర్మయచారీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అయ్యప్ప స్వామి మహా పడి పూజ మహోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. అయ్యప్ప స్వామికి అభిషేకం నిర్వహించారు. మహా పడి పూజ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామియే శరణం అయ్యప్ప అంటూ అయ్యప్ప షరుణుఘొషతో కాలనీ ప్రాంగణం అత్మాధ్మిక శోభ సంతరించుకుంది . మహపడిపూజ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భక్తులు అయ్యప్ప నామస్మరణతో భజనాలు, భక్తీ భక్తి గీతాలను ఆలపించారు. పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన కాప్రా కాంగ్రెస్ సీనియర్ నాయకులు



**తెలంగాణ వీణ/కాప్రా:** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, టెక్స్ టైల్స్, మార్కెటింగ్, హ్యాండ్లూమ్స్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావును తన ఛాంబర్ లో కాప్రా సర్కిల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి అభినదనలు తెలియజేసారు,ఈ కార్యక్రమంలో కాప్రా కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకులు పోలేగొని శ్రవణ్ కుమార్ గౌడ్, హెచ్ బి కాలనీ కాంటెస్ట్ కార్పొరేటర్ పోలపాక అంజయ్య, ఏండి అమ్మద్ ఝూని తదితరులు పాలుగోన్నారు.

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

### - ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి



**తెలంగాణ వీణ/జవహర్‌నగర్:** ప్రభుత్వ సంక్షేమపథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి , మేడ్చల్ ఎమ్మెల్యే సీహెచ్ మల్లారెడ్డి తెలిపారు. మంగళవారం జవహార్ నగర్ కార్పొరేషన్ పరిధిలో మంజూరైన కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్పొరేషన్ పరిధిలోని రెవెన్యూ కార్యాలయంలో 20 మంది లబ్ధిదారులకు రూ, లక్ష 116 రూపాయల చెక్కులను అందజేశారు. ఘట్కేసర్ మండలం లో ఐదుగురికి పోచారంలో ఐదుగురికి, ఘట్కేసర్ మున్సిపాలిటీ లో 8 మందికి, కీసర మండల పరిధిలోని దమ్మైగూడ నాగారం మున్సిపాలిటీ కి చెందిన 35 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి లక్ష 116 రూపాయల చెక్కులను మల్లారెడ్డి అందజేశారు. అదేవిధంగా షామీర్పేట్ మండ పరిధిలోని ఎంపీడీవో కార్యాలయంలో తూముకుంట మున్సిపాలిటీకి చెందిన లబ్ధిదారులకు కూడా కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను మాజీమంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి పంపిణీ చేశారు.

## దమ్మాయిగూడ మున్సిపల్ అభివృద్ధికి రూ.31 లక్షలు

### - కౌన్సిల్ సమావేశంలో తీర్మాణం



**తెలంగాణ వీణ/కీసర:** దమ్మాయిగూడ మున్సిపల్ అభివృద్ధికి తగిన నిధులు వెచ్చిస్తున్నట్లు మున్సిపల్ ఛైర్ పర్సన్ వసుపతి ప్రణీతా శ్రీకాంత్ గౌడ్ తెలిపారు . మంగళవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశం పలు అభివృద్ధి పనులకు సభ్యులు తీర్మానించారు. మున్సిపల్ పరిదిలోని 18వార్డుల్లో భూగర్భ మురికి కాలువలను పునరుద్ధరించడానికి రూ. 18 లక్షలు, చెరువులో బతుకమ్మ నిమజ్జన ఏర్పట్ల ప్యాచ్ వర్కు కోసం రూ.7 లక్షలు, సీసీ రోడ్డు కు రూ.6 లక్షలు కేటాయించాలని తీర్మాణంచారు. ఇందుకు గాను రూ. 31 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేయుటకు తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎస్. రాజ మల్లయ్య, డీఈఈ చిరంజీవులు, మేనేజర్ వెంకటేశం, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సింగరేణిలో గుర్తింపు ఎన్నికలు జరిగేనా?

### - అనుమానమే అంటున్న కార్మిక సంఘాలు

### - గుర్తింపు ఎన్నికల నగారాపై ఉత్కంఠ

**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:** సింగరేణిలో ఎట్టకేలకు గుర్తింపు సంఘం ఎన్నికల జరపాలని ముహూర్తం ఫిక్స్ అయింది. ఈనెల 27వ తేదీన సింగరేణి కోల్ బెల్ట్ వ్యాప్తంగా వ్యాప్తంగా గుర్తింపు ఎన్నికలు జరిపేందుకు డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే ఎన్నికలు ఈ నెలలో వద్దని కొందరు కోర్టును ఆశ్రయించడం జరిగింది. దీనిపై ఈనెల 21వ తేదీన తీర్పు వెలువడనున్నది. ఇదిలా ఉండగా సింగరేణి కాలరీస్ కంపెనీలో ఇప్పటివరకు జరిగిన కార్మిక సంఘం ఎన్నికల్లో ఇప్పటికే సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) మూడుసార్లు, సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్(ఐ ఎన్ టి యు సి) ఒక్కసారి, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) రెండుసార్లు గెలిచి అధికారాన్ని చేపట్టిన విషయం అందరికి తెలిసిందే. మొత్తము ఆరుసార్లు సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరగడం జరిగింది. ఈసారి జరిగితే ఏడోసారి గుర్తింపు ఎన్నికల్లో ఏ యూనియన్ గెలుస్తుందో వేచి చూడాల్సిందే.

## మహిళలకు ఫ్రీ జర్నీ స్కీమ్ ఎత్తేయాలి..

### - బస్ భవన్ ముట్టడికి ఆటో కార్మికుల యత్నం




**తెలంగాణ వీణ/హైదరాబాద్:** బస్సు భవన్ ముట్టడికి మంగళవారం ఉదయం భారతీయ మజ్దూర్ సింఘ్(బీఎంఎస్) ఆటో కార్మికులు యత్నించారు. పలు డిమాండ్ల సాధనతో నిరసన ప్రదర్శన చేపట్టారు వాళ్లు. ఈ క్రమంలో బస్‌భవన్ వైపు దూసుకెళ్లే యత్నం చేయగా.. పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది అక్కడ. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులతో.. తమ కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆటో కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరిగ్గా అదే సమయంలో తెలంగాణ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం మహిళలకు ఉచిత ప్రయాణ పథకం తీసుకొచ్చింది. పథకానికి వ్యతిరేకంగా పలు జిల్లాల్లోనూ నిరసన ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఫ్రీ జర్నీ స్కీమ్‌ను ప్రభుత్వం రద్దు చేయాలని, అలాగే తమ ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు.

## కేటీఆర్, సిద్ధరామయ్యల ట్వీట్ వార్.. వాటిపైనే మాటల యుద్ధం



**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మధ్య మంగళవారం ఎక్స్ లో మాటల యుద్ధం జరిగింది. కర్ణాటక, తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారెంటీల అమలుపై ఇద్దరి మధ్య ట్వీట్ వార్ నడిచింది. ఎన్నికల్లో ఓట్ల కోసం ఏదో గ్యారెంటీలని చెప్పాం. అంత మాత్రానా అన్నీ ఫ్రీగా ఇస్తామా. అయినా మాకూ ఇవ్వాలనే ఉంది. అయితే డబ్బులు లేవు. అని కర్ణాటక అసెంబ్లీలో సిద్ధారమయ్య మాట్లాడినట్లుగా ఒక హ్యాం?డిల్‌లో పోస్ట్ అయిన వీడియోపై కేటీఆర్ స్పందించారు. తెలంగాణలోనూ ఇదే పరిస్థితి రానుందని కాంగ్రెస్ తెలంగాణ ప్రజలను మోసం చేసిందని కేటీఆర్ కామెంట్ చేశారు. అయినా ఎన్నికల హామీలిచ్చేటపుడు ఆర్థిక పరిస్థితిపై కనీస అవగాహన ఉండాలిగా అని ఎద్దేవా చేశారు. కేటీఆర్ ట్వీట్‌కు సిద్ధరామయ్య అంతే ఘాటుగా స్పందించారు. కేటీఆర్ మీరు తెలంగాణ ఎన్నికల్లో ఎందుకు ఓడిపోయారో తెలుసా.కనీసం మీకు నిజమేంటో.. నకిలీ,ఎడిటెడ్ ట్వీట్ ఏంటో తెలియదు అందుకే ఓడిపోయారు.

## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

### - చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి



**తెలంగాణ వీణ/కీసర :** పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతగా గుర్తించాలని నాగారం మున్సిపల్ ఛైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ పరిసర ప్రాంతాలను స్వచ్ఛతగా మార్చుకోవాలన్నారు. మంగళవారం మున్సిపాలిటీలోని రాంపల్లి, నాగారంలో కొత్తగా ఏర్పాటు చేసే పబ్లిక్ టాయిలెట్లు స్థలాన్ని అధికారులతో కలసి స్థలాలను పరిశీలించారు. స్వచ్ఛభారత్ మిషన్ నుంచి మున్సిపాలిటీకి 12 సీట్లు కట్టుకొనుటకు నిధులు మంజూరు అయ్యాయిన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి. రాజేంద్ర కుమార్, మేనేజర్ కే. చంద్రశేఖర్, డీఈఈ సుదర్శనం రఘు, శానిటరీ ఇన్స్పెక్టర్ డి. రామ్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## బాలికల హక్కులపై అవగాహన కల్పించాలి

### - అదనపు కలెక్టర్ రాంబాబు

**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:** బాలికల హక్కులపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.రాంబాబు అన్నారు. మంగళవారం బాలికల సాధారకతపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీ ఏరియా కనుక గిరిజనులు వెనుకబడిన కుటుంబాల బాలికలకు తమ హక్కులు ఆరోగ్య పరిరక్షణ వ్యక్తిగత మానసిక వికాసం గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఏజెన్సీలలో ప్రజలు బాలికలకు చిన్న వయసులోనే వివాహాలు జరిపించడం తమ ఆచారంగా భావిస్తారని ఆ వివాహాల వల్ల జరిగేనష్టాన్ని వాళ్లకు వివరించాలని ఆడపిల్లల మానసిక శారీరక పరిస్థితులపై ప్రతికూల ప్రభావాలు ఏర్పడతాయని వాళ్లకు చెప్పాలన్నారు. సఖి కేంద్రం సిబ్బంది ప్రతిరోజు ఒక గ్రామానికి వెళ్లి పెద్దలతో పాటు అన్ని రకాల వయసుల ఆడపిల్లలకు అవగాహన కార్యక్రమం నిర్వహించాలని చెప్పారు. గ్రామాలలో ఒంటరి మహిళ లేదా పూర్తిగా తల్లిదండ్రులు లేని పిల్లలు ఈ సమస్యలకు గురవుతున్నారని అన్నారు. అలాంటి పిల్లలను గుర్తించి ప్రభుత్వపరంగా ఏర్పాటైన హాస్టల్స్, గురుకులల్లో



వారికి ప్రవేశం కలిగేలా ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకుగాను పోలీసు ఐసిడిఎస్ సిబ్బంది సఖి కేంద్రం మెడికల్ సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కార్మిక అధికారి సర్ఫుద్దీన్, కెజిబివి జిసిడిఓ అన్నామణి,షీటీం ఎస్ ఐ రమాదేవి, సఖి అడ్మిన్ జె.శుభశ్రీ, మెంబర్ సిడబ్ల్యూసిఎస్ సుమిత్ర దేవి, డాక్టర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

### దళిత బంధు లబ్ధిదారులకు

## నిధులు విడుదల చేయాలి



**తెలంగాణ వీణ/ములుగు:** ములుగు జిల్లా ఏటురూనాగారంలో మాకు గత ప్రభుత్వం అక్టోబర్ నెలలో మాకు దళిత బంధు. మంజూరు అయినది .కానీ అప్పుడు ఎలక్షన్ కోడ్ ఉండడం వలన. వాటిని నిలిపివేయడం జరిగింది ఇప్పుడు ఉన్న కొత్త ప్రభుత్వం అనేది తేదీ . 03.12.2023 . నాడు కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడం జరిగింది అప్పటినుండి మాకు , ఇవ్వవలసిన దళిత బందు ఇప్పటివరకు. అకౌంట్లో జమ కాలేదు కావున ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అధికారులు స్పందించి మాకు దళిత బంధు నిధులు జమ చేయగలరని స్థానిక ఎంపీడీవో గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పాల్గొనడం జరిగింది.

## గుంజుకున్న దళితుల భూములను ప్రభుత్వం తిరిగి ఇవ్వాలి

**- పిల్లి సుధాకర్ రాష్ట్ర అధ్యక్షులు తెలంగాణ మాలమహానాడు**



**తెలంగాణ వీణ/ములుగు:** ములుగు జిల్లా ఏటూరునాగారం లో మాలమహానాడు సమావేశంలో గత 10 ఏళ్ళుగా స్మశానవాటిక, పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డ్, ప్రభుత్వ భవనాల పేరుతో గుంజుకున్న దళితుల అసైన్డ్ భూములను నూతన ప్రభుత్వం తిరిగి ఇవ్వాలని విజ్ఞప్తి చేసిన మాల మహా నాడు నాయకులు భూమి కోల్పోయిన దళితులను ఈ రాష్ట్ర ప్రభుత్వమే ఆదుకోవాలని ఏజెన్సీ దళితులకు భూమిపై హక్కు కల్పించి దళితుల అభ్యున్నతికి ప్రభుత్వం పాటుపడాలని కోరుతూ మాల మహానాడు నాయకులు ఈసమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెల్ల ప్రభాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గంపల శివ, రాష్ట్ర కార్యదర్శి దార నాయకులు వేల్పుల సమ్మక్క, రమేష్, మండల తిరుపతి, పప్పుల చంద్రమౌళి పాల్గొన్నారు.

## క్రికెటర్‌ను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



**తెలంగాణ వీణ/వరంగల్ ప్రతినిధి:** వరంగల్ పోచమ్మ మైదాన్ ప్రాంతంలోని 21వ డివిజన్ ఎల్బీనగర్ ప్రాంతానికి చెందిన సోహెల్ క్రికెట్ ఆడుతూ ప్రమాదవశాత్తు జారిపడగా చికిత్స నిమిత్తం గార్డియన్ హాస్పిటల్ లో చేర్పించడం జరిగింది. ఇట్టి విషయాన్ని తెలుసుకొని ఎల్బీనగర్ కు చెందిన కాంగ్రెస్ నాయకులు మొహమ్మద్ అమీర్ పాష సోహెల్ ని హాస్పిటల్‌లో పరామర్శించి త్వరగా కోలుకోవాలని మనోధైర్యం కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఎల్బీనగర్ కు చెందిన ఫర్హాన్ రిజ్వాన్ ఇర్ఫాన్ యూత్ నాయకులు కార్యకర్తలు సోహెల్ ను పరామర్శించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

**తెలంగాణ వీణ/ములుగు :** మన ప్రియతమ నాయకురాలు మహిళా ప్రధాన కార్యదర్శి,తెలంగాణా రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి,స్త్రీ-శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరిఅనసూయ(సీతక్క) ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షులు-పైడాకుల.అశోక్ సూచనల మేరకు గురువారం ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని నల్లగుంట గ్రామంలో చలికాలం వెచ్చగా ఉండేవిధంగా ఒక 20 మంది వృద్ధులకు తమవంతు సహాయంగా కాంగ్రెస్ నాయకులు-భూక్య.సదర్ సింగ్,మోరె. లింగస్వామి గార్లు దుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది. వృద్ధులకు సహయం అందించడంలో చాలా సంతోషంగా ఉంది అని కాంగ్రెస్ నాయకులు వెల్లడించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అనారోగ్య కారణంగా మృతి చెందిన డాక్టర్ శివారపు జనార్ధన్ కుటుంబాన్ని పరామర్శించి మానవత్వం చాటుకున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం

**- ములుగు జిల్లా అధ్యక్షులు బట్ట మురళీకృష్ణ ఉపాధ్యక్షులు మంచెర్ల నాగేశ్వరరావు**



**తెలంగాణ వీణ/ములుగు:** ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఎర్రలవాడలో నివసిస్తున్న డాక్టర్ శివారపు జనార్దన్ గత ఆరు నెలల నుంచి తన ఆరోగ్యం బాగా లేకపోవడంతో అనారోగ్యంతో బాధపడుతూ ఎంజీఎంలో చికిత్స పొందుతూ ఆదివారం మరణించారని.డాక్టర్ జనార్దన్ ఏటూరునాగారం ప్రజలకు 25 సంవత్సరాలుగా తన వృత్తిపరంగా వైద్యం చేస్తూ చాలామందికి రోగాలను తగ్గించేవాడని ఏటూరునాగారం ప్రజలందరికీ అందుబాటులో ఉంటు కలినడకనే తిరుగుతూ ప్రజలకు వైద్యం చేసే వారని అతని అకాల మరణం ప్రజలకు తీరనిలోటని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ములుగు జిల్లా అధ్యక్షులు బట్ట మురళీకృష్ణ అన్నారు.అకాల మరణం చెందిన డాక్టర్ జనార్ధన్ కుటుంబాన్ని ఈరోజు పరామర్శించి వారి కార్యక్రమాల నిమిత్తం క్వింటా బియ్యం అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బట్టగోపి,ఏటునాగరం మండల ప్రధాన కార్యదర్శి ఇర్సవడ్ల కిరణ్,మండల బిసి నాయకులు ,బండారి రాము ఎర్రల నాగరాజు,బట్ట కొమరయ్య కోసంగి రాంబాబు పెద్ద బోయిన సమ్మయ్య, మాటూరి పాపయ్య,ఎర్రల నారాయణ, మంచెర్ల గౌరయ్య, కొంకతి కృష్ణ, కొడెం సాయి తాండ్ర బక్కయ్య కొంకతి వెంకట్ నర్సయ్య పాల్గొన్నారు.

## క్రీడాకారులకు కనీస సౌకర్యాలకు కృషి

**- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:** క్రీడాకారులకు కావలసిన సౌకర్యాలు కల్పించేందుకు తనవంతుగా కృషి చేస్తానని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యేగా గెలుపొంది నూతనంగా బాధ్యతలు చేపట్టిన కూనంనేని సాంబశివరావుని ఆయన నివాసంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడా సంఘాల ప్రతినిధులు పి. కాశీ హుస్సేన్(జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్), ఇ.మొగిలి(జిల్లా టైక్వాండో అసోసియేషన్), కే.కృష్ణారావు(జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్) ఆధ్వర్యంలో పలువురు క్రీడా సంఘాల కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సాంబశివరావు స్పందించి మాట్లాడుతూ క్రీడా కారులకు కావలసిన అన్ని రకాల అవసరతలను గుర్తించి కావలసిన తగు సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు. ఆదినారాయణ, ఇండియన్ స్టైల్ రెజ్లింగ్ లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.భూపేష్ కుమార్, జిల్లా కరాటే అసోసియేషన్ ప్రతినిధి కే.సదానందం, జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.నిహారిక పలువురు కోచులు, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తా...

**- ప్రభుత్వ పాలనలో అధికారులది గొప్ప పాత్ర**

**- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని**




**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:** ప్రభుత్వ పాలనలో అధికారులది గొప్ప పాత్ర అని నియోజకవర్గ పాలనలో పెద్దన్న పాత్ర పోషిస్తూ అన్ని వర్గాల ప్రజలకు న్యాయం న్యాయం చేస్తానని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం ఆయన కొత్తగూడెం క్లబ్లో పలు శాఖల అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాంబశివరావు మాట్లాడుతూ కొత్తగూడెం నియోజకవర్గం రెండు పట్టణాలు ఐదు మండలాలుగా ఉందన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందే విధంగా అధికారులు తమ కార్యకలాపాలను నిర్వహించాలని కోరారు. నియోజకవర్గం రానున్న కాలంలో పెద్ద పారిశ్రామిక ప్రాంతంగా విరజిల్లాలని అన్నారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలు నెలకొల్పుటకు అనువైన ప్రాంతాలను గుర్తించి పరిశ్రమలు నెలకొల్పుటకు ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతానన్నారు. పాల్వంచ పట్టణం మునిసిపల్ ఎన్నికలు జరగక నేటికీ 21 సంవత్సరాల కాలం పూర్తయిందని పాల్వంచ మున్సిపల్ ఎన్నికలు త్వరలో జరుగుటకు అధికారులు న్యాయపరమైన సలహాలు సూచనలు ఇస్తూ ఎన్నికలు జరిగే విధంగా కృషి చేయాలని చెప్పారు. నియోజకవర్గంలో నిలిచిపోయిన బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను అతి త్వరలో పున ప్రారంభించి ప్రాంత అభివృద్ధికి పాటుపడతానన్నారు. ఈ ప్రాంత ప్రజలు తనపై విశ్వసనీయతను ఉంచి జరిగిన ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా సుపరిపాలనను నియోజకవర్గ ప్రజలకు అందిస్తానని అన్నారు. ఈ ప్రాంతలో కొత్త బొగ్గు బావులను పరిశ్రమలను పాల్వంచలోని స్పాంజ్ ఇలాంటి పరిశ్రమలను పునరుద్ధరించి నిరుద్యోగులకు ఇక్కడే ఉద్యోగ అవకాశాలను కల్పిస్తానన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వంలోని పెద్దలతో సంప్రదింపులు జరిపి తీసుకొస్తానన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యలు తీర్చుటలో ప్రభుత్వ అధికారులు ముందంజలో ఉండాలని కోరారు. ప్రజా సమస్యలు వాటిని పరిష్కరించుట కొరకు నియోజకవర్గ అధికారులతో కలసి వారంలో ఒకరోజు తానే స్వయంగా ప్రజా సమస్యల పరిష్కారానికి హాజరవుతానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ కాపు సీతాలక్ష్మి, సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, నాగ సీతారాములు, లక్ష్మీదేవిపల్లి ఎంపీపీ సోనా, చుంచుపల్లి ఎంపీపీ శాంతి, సిపిఐ కౌన్సిలర్లు, మండల కార్యదర్శులు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందు ఆయా శాఖల అధికారులు నూతనంగా శాసనసభ్యునిగా ఎన్నికైన సాంబశివరావును పూలమాలలు శాలువాలతో సత్కరించారు.

## సేవకు చిరునామా..అమృత హాస్పిటల్

**- గిరిజన కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ**

**- చిన్నారులకు స్నాక్స్ అందజేసిన ఫౌండేషన్ టీం**



**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:** సేవకు చిరునామాగా అమృత హాస్పిటల్ నిలిచింది. చలికాలం దృష్ట్యా దీనిని గుర్తించి మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో ఉండే గిరిజనులు ఇబ్బందులకు గురి కాకూడదనే ఉద్దేశంతో వారు చలిని తట్టుకొని ఉండేందుకు అందుకు కావలసిన దుప్పట్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం యానాంబైలు గ్రామ పంచాయతీ పరిధిలోని సరేకళ్ళు అనే గిరిజన గ్రామంలో నివసిస్తున్న కుటుంబాలకు మంగళవారం దుప్పట్లు పిల్లలకు స్నాక్స్ అందించడం జరిగింది. గత కొన్ని రోజులుగా చలి తీవ్రత పెరగడంతో అడవిలో నివసిస్తున్న గిరిజన కుటుంబాలు చలి తీవ్రతతో ఇబ్బందులుపడుతున్నారని తెలుసుకున్న హ్యాపీ టూ హెల్ప్ యు ఫౌండేషన్ సభ్యులు అండ్ కొత్తగూడెంలో ఉన్న అమృత హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ బాబురావు, డాక్టర్ జయ సహాయసహకరలతో ఆ గిరిజన గ్రామంలో నివసిస్తున్న కుటుంబాలకు దుప్పట్లు పిల్లలకు స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జయ ఫౌండేషన్ సభ్యులు లేంటిల్, గంగా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## బూత్ లేవిల్ అధికారులకు ట్రైనింగ్




**తెలంగాణ వీణ/ములుగు:** ములుగు జిల్లా వాజేడు మండలం కేంద్రంలో తాసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో బూత్ లేవిల్ అధికారులకు ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది, ఇందులో ఎన్నికల విధుల గురించి, కుటుంబ సభ్యులు అందరూ ఒకే పోలింగ్ కేంద్రములో ఓటు వేయుటకు వీలుగా %టశీతీఎ% -8 ఉపయోగించి సవరణ చేయుట, 1 వ జనవరి, 2024 వరకు 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటుహక్కు కల్పించుట, బూత్ లేవిల్ అధికారులకు రిజిస్టర్ నిర్వహణ, నమోదు గూర్చి, అలాగే ఫారం -6,7,8, ఆధారాలు జతపరచుట, డెత్ డబుల్ ఓటర్ తొలగింపు ల గురించి, కొత్తగా ఓటు హక్కు నమోదు గురించి, త్వరితగతిన విచారణ పూర్తిచేయుట గురించి %దీూా% ల కు, %దీూా% సూపర్ వైజర్ లకు తెలియజేసి నారు.ఇట్టి కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, నాయబ్ తహసీల్దార్ రాహుల్ చంద్ర వర్మ, గిరిదావర్ రాజు, %దీూా% లు, %దీూా% సూపర్ వైజర్ లు పాల్గొన్నారు.

### మహాసభల గోడ పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కూనంనేని



**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:** వచ్చే ఏడాది జనవరి 5, 6, 7 తేదీలలో ఆంధ్రప్రదేశ్ రాజమండ్రి లో ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండవ అంతర్జాతీయ తెలుగు మహాసభలకు సంబంధించిన గోడపత్రికను మంగళవారం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆవిష్కరించారు.తెలుగు మహాసభల నిర్వాహకులకు కవులకు కళాకారులకు ఎమ్మెల్యే కూనంనేని అభినందనలు తెలిపారు. ఆ తరువాత అంతర్జాతీయ తెలుగు మహాసభల సంచాలకులు గజల్ కవి రాజేష్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే మహాసభలలో ప్రముఖ గజల్ గాయకులు గజల్ శ్రీనివాస్ నిర్వహణలో వివిధ సాహితీ ప్రక్రియలపై సదస్సులు కవిసమ్మేళనం కథా పఠనం సాంస్కృతిక కార్యక్రమాలు కళారూపాలు వంటి అనేక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సుమారు 70 దేశాల నుండి ప్రతినిధులు లక్షలమంది సాహితీ ప్రియులు పాల్గొంటారని నాలుగు రాష్ట్రాల గవర్నర్లను రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులను మంత్రులను చలన చిత్ర ప్రముఖులను సాహితీవేత్తలను ఆహ్వానించామని తెలిపారు. ప్రజలందరూ పాల్గొని సభలను విజయవంతం చేయాలని కోరారు. ప్రముఖ కవి తూముల శ్రీనివాస్, లఘుచిత్ర దర్శకులు రచయిత కొత్తపల్లి శేషు, ప్రముఖ కవి నాగులపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకాశం స్టేడియంలో మహిళల ఆటల సందడి




**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:** సింగరేణి కార్పొరేట్ ఆధ్వర్యంలో కొత్తగూడెం పరిసర ప్రాంత మహిళలకు సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు-2023 పురస్కరించుకొని కొత్తగూడెం ప్రకాశం స్టేడియం నందు మంగళవారం ఆటల పోటీలను నిర్వహించడం జరిగింది. ఈ ఆటల పోటీలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏజిఎం(పర్సనల్) శ్రీనివాసరావు ఈ పోటీలను ప్రారంభించారు. ఈ ఆటల పోటీలలో నిర్వహించిన పాసింగ్ ద బాల్ మ్యూజికల్ చైర్ బాంబ్ ఇన్ సిటి తదితర ఆటల పోటీలలో మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భముగా ఏజిఎం(పర్సనల్) కే.శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడలలో పాల్గొనటం ద్వారా ఆరోగ్యం కూడా మెరుగుపరచుకోవచ్చని తెలిపారు. క్రీడలలో గెలుపు ఓటములు రెండూ కూడా సమానం అని అందరూ కూడా ఈ ఆటల పోటీలలో ఉత్సాహంగా పాల్గొనాలని ఈ పోటీలలో గెలుపొందిన వారికి ఈనెల 23వ తేదీన సింగరేణి డే సందర్భంగా ప్రకాశం స్టేడియం నందు నిర్వహించే సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో బహుమతుల ప్రధానం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమములో ఏజిఎం(పర్సనల్) కే.శ్రీనివాస రావుతో పాటు సీనియర్ పిఓ టి.శ్రీనివాస రావు, వెల్ఫేర్ పిఏ వర ప్రసాద్, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ ఫాస్నెట్, సేవా కొ ఆర్డినేటర్ ఎంఎ షరీఫ్, సేవా సెక్రటరీ మునీల, సేవా కోఆర్డినేటర్లు సుజాత, పుష్ప లత, మీనా కుమారి, రామాదేవి, హిమబిందు, అరుణ, స్వర్ణ లత, దీప, వహిద, సేవా సభ్యులు, శిక్షకులు పాల్గొన్నారు.

## చెలరేగుతున్న సఫారి బౌలర్లు..

# ఆచితూచి ఆడుతున్న భారత్



సెయింట్ జార్జ్ పార్క్ వేదికగా భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య రెండో వన్డే జరుగుతోంది. ఈ మ్యాచ్ లో టాస్ ఓడి బ్యాటింగ్ చేపట్టిన టీమిండియాకు ఆదిలోనే షాక్ తగిలింది. స్వల్ప వ్యవధిలో భారత్ రెండు కీలక వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్, 4 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద పెవిలియన్ కు చేరాడు.అనంతరం క్రీజులోకి వచ్చిన తిలక్ వర్మ(10) స్వల్ప వ్యవధిలోనే ఔటై నిరాశపర్చాడు. దీంతో భారత్ 16 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 56 పరుగులు చేసింది. ప్రస్తుతం క్రీజులో మరో ఓపెనర్ సాయి సుదర్శన్(37), కెప్టెన్ కెఎల్ రాహుల్(2)లు ఉన్నారు.

# ఐపిఎల్ వేలంలో రికార్డ్..

**- మిచెల్ స్టార్క్‌కు రూ.24.75 కోట్లు**



ఐపీఎల్ మినీ వేలంలో అద్భుతాలు చోటు చేసుకుంటున్నాయి. వన్డే ప్రపంచ కప్ గెలుచుకున్న ఆస్ట్రేలియా జట్టు ఆటగాళ్లకు వేలంలో భారీ ధర పలుకుతోంది. ఆ జట్టు కెప్టెన్ కమిన్స్ ను 20 కోట్లకు సన్ రైజర్స్ సొంతం చేసుకుంటే, పేస్ బౌలర్ మిచెల్ స్టార్క్ ను కోల్ కతా నైట్ రైడర్స్ ఏకంగా 24.75 కోట్లకు దక్కించుకుంది. రెండు కోట్లతో వేలంలో నిలిచిన స్టార్క్ కోసం గుజరాత్ టైటాన్స్, కోల్ కతా నైట్ రైడర్స్ మధ్య హెూరాహెూరీ పోరు సాగింది. చివరకు కోల్ కతా నైట్ రైడర్స్ పైచేయి సాధించింది.వెస్టిండీస్ ఆటగాడు అల్జారీ జోసెఫ్ ను 11.50 కోట్లు చెల్లించి రాజస్థాన్ రాయల్స్ సొంతం చేసుకుంది. భారత పేసర్ ఉమేశ్ యాదవ్ ను 5.8 కోట్లతో గుజరాత్ టైటాన్స్ కొనుగోలు చేయగా, శివం మావిని లక్నో సూపర్ జెయింట్స్ 6.4 కోట్లతో దక్కించుకుంది. హైదరాబాద్ బ్యాటర్ కె.ఎస్. భరత్ ను 50 లక్షలకు కోల్ కతా నైట్ రైడర్స్ దక్కించుకుంది.

# బ్యాటర్లపై బిసిసిఐ బౌన్సర్!



టీ20 క్రికెట్ పేరు చెబితే సూర్యకుమార్, కోహ్లీ, మాక్స్ వెల్ వంటి బ్యాటర్లు గుర్తుకొస్తారు. అయితే ఇలాంటి బ్యాటర్ల దూకుడుకు అడ్డుకట్ట వేసేలా బీసిసిఐ ఒక కొత్త రూల్ ని తీసుకు రానున్నట్లు తెలుస్తోంది.ఇకపై టీ20 బౌలర్లు ఒక ఓవర్లో రెండు బౌన్సర్లు వేయవచ్చు. ఇదే ఆ కొత్త రూల్. దీనివల్ల డెత్ ఓవర్లలో పరుగుల వరద పారించాలనుకునే బ్యాటర్లకు ఇబ్బందే. వన్డేల్లోనూ, టెస్టుల్లోనూ ఒక ఓవర్లో రెండు బౌన్సర్లు వేసేందుకు అనుమతి ఉన్నా, టి20లలో మాత్రం ఒకే బౌన్సర్ కే అనుమతి ఉంది. కొత్త రూల్ వల్ల చివరి ఓవర్లో ఫాస్ట్ బౌలర్లు యార్కర్లతోపాటు బౌన్సర్లనూ సంధించి, బ్యాటర్ల దూకుడుకు అడ్డుకట్ట వేయవచ్చు.

# ఐపీఎల్ వేలంలో అన్ సోల్డ్‌గా మిగిలిపోయిన టాప్ బ్యాటర్లు



ఐపీఎల్ మినీ వేలం జోరుగా సాగుతోంది. ఊహించని విధంగా కొందరు క్రికెటర్లకు భారీ ధర పలికింది. టాప్ ప్లేయర్లని భావించిన కొందరు అన్ సోల్డ్ గా మిగిలిపోవడం విశేషం. ఆస్ట్రేలియా టాప్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ అన్ సోల్డ్ గా మిగిలిపోవడం గమనార్హం. రెండు కోట్లతో వచ్చిన స్మిత్ ను కొనేందుకు ఎవరూ ఆసక్తి చూపలేదు. దక్షిణాఫ్రికా ఆటగాడు రిలీ రొసోవ్ ను కూడా ఎవరూ కొనలేదు. రెండు కోట్ల ధరతో బరిలోకి దిగిన రొసోవ్ అన్ సోల్డ్ గా మిగిలిపోయాడు.ఇంగ్లండ్ ఆటగాడు, 24 ఏళ్ల హ్యారీ బ్రూక్ కు భారీ ధర పలికింది. నాలుగు కోట్ల రూపాయలు చెల్లించి ఢిల్లీ కాపిటల్స్ దక్కించుకుంది. బ్రూక్ కోసం రాజస్థాన్ రాయల్స్ కూడా పోటీ పడింది. కానీ చివరకు ఢిల్లీ క్యాపిటల్స్ పంతం నెగ్గింది.మరో ఆసీస్ ఆటగాడు ట్రావిస్ హెడ్ ను సన్ రైజర్స్ జట్టు దక్కించుకుంది. రెండు కోట్లతో బరిలో నిలిచిన ట్రావిస్ హెడ్ ను 6.80 కోట్లు చెల్లించి, సన్ రైజర్స్ సొంతం చేసుకుంది. ట్రావిస్ కోసం చెన్నై సూపర్ కింగ్స్ చివరవరకూ గట్టిగా ప్రయత్నించింది.

# సౌతాఫ్రికాతో రెండో వన్డే... తొలి వికెట్ కోల్పోయిన టీమిండియా




సెయింట్ జార్జ్ పార్క్ వేదికగా భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య రెండో వన్డే జరుగుతోంది. ఈ మ్యాచ్ లో టాస్ గెలిచి సౌతాఫ్రికా బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్ చేపట్టిన టీమిండియాకు ఆదిలోనే షాక్ తగిలింది. ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్(4) పెవిలియన్ కు చేరాడు. ప్రస్తుతం భారత్ 4 ఓవర్లలో వికెట్ నష్టానికి 13 పరుగులు చేసింది. క్రీజులో మరో ఓపెనర్ సాయి సుదర్శన్(7), తిలక్ వర్మ(2)లు ఉన్నారు. కాగా, మూడు వన్డే మ్యాచ్‌ల సిరీస్‌లో టీమిండియా తొలి మ్యాచ్ లో ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. దీంతో భారత్ 1-0 ఆధిక్యంలో కొనసాగుతోంది.

# భారత్‌పై 8 వికెట్ల తేడాతో సఫారీల అలవోక విజయం..



గబెరాలో మంగళవారం భారత్‌తో జరిగిన రెండో వన్డేలో ఆతిథ్య దక్షిణాఫ్రికా జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో గెలుపొందింది. 212 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన దక్షిణాఫ్రికా 42.3 ఓవర్లలోనే కేవలం రెండు వికెట్లు కోల్పోయి విజయ తీరాలకు చేరింది. దక్షిణాఫ్రికా బ్యాటర్లలో జోర్జీ 119 పరుగులు, హెండ్రిక్స్ 52, డస్సెన్ 36 పరుగులు చేశారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో నండ్రే బర్గర్ మూడు వికెట్లు, కేశవ్ మహరాజ్, బౌరాన్ హెండ్రిక్స్ చెరో రెండు, లిజాడ్ విలియమ్స్, అడైన్ మక్రం చెరో వికెట్ తీశారు.తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 46.2 ఓవర్లలోనే 211 పరుగులకు ఆలౌట్ అయింది. సాయి సుదర్శన్ 62 పరుగులు, కేఎల్ రాహుల్ 56 పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లు పరుగులు చేయలేక విఫలమయ్యారు. దీంతో సఫారీలు మూడు వన్డేల సిరీస్‌ను 1-1 పాయింట్లతో సమం చేశారు. భారత్ బౌలర్లలో అర్షదీప్ సింగ్, రింకూ సింగ్ చెరో వికెట్ తీశారు. సిరీస్ ను సమం చేసే మూడో వన్డే ఈ నెల 21న జరుగనున్నది.


# ఆస్ట్రేలియా కెప్టెన్ కమిన్స్కు రికార్డు ధర



ఐపీఎల్‌లో ఆస్ట్రేలియా కెప్టెన్ కమిన్స్ చరిత్ర సృష్టించాడు. అతనికి 20.50 కోట్లు చెల్లించి, సన్ రైజర్స్ సొంతం చేసుకుంది. కమిన్స్ కనీస ధర రెండు కోట్లే కావడం విశేషం. న్యూజీలాండ్ ఆల్ రౌండర్ డారిల్ మిచెల్ ధర 14 కోట్లు పలికింది. అతన్ని చెన్నై సూపర్ కింగ్స్ కొనుగోలు చేసింది.భారత పేస్ బౌలర్ హర్షల్ పటేల్ ను పంజాబ్ కింగ్స్ 11.75 కోట్లు చెల్లించి సొంతం చేసుకుంది. దక్షిణాఫ్రికా పేస్ బౌలర్ గెరాల్డ్ కొయిట్జీని ముంబయి ఇండియన్స్ ఐదు కోట్లు చెల్లించి కొనుగోలు చేసింది. అతని కనీస ధర 50 లక్షలు మాత్రమే. ఇంగ్లండ్ ఆల్ రౌండ్ క్రిస్ వోక్స్ కు 4.2 కోట్లు చెల్లించి, పంజాబ్ కింగ్స్ సొంతం చేసుకుంది.


# బ్రూక్‌కు షాక్..

**- రూ. 9.25 కోట్లు ఫట్**




ఇంగ్లండ్ యువ సంచలనం హ్యారీ బ్రూక్‌ను గతేడాది మినీ వేలంలో సన్ రైజర్స్ హైదరాబాద్ ఏకంగా రూ. 13.25 కోట్లు వెచ్చించి దక్కించుకున్నది. అతడి మీద భారీ ఆశలు పెట్టుకున్నా గత సీజన్‌లో అతడు దారుణంగా విఫలయవడంతో తాజా సీజన్‌కు ముందు జరిగిన రిటెన్షన్ ప్రక్రియలో ఎస్ఆర్‌హెచ్ అతడిని వేలానికి వదిలేసింది. ఐపీఎల్‌లో సరిగా ఆడకపోయినా టెస్టులతో పాటు అంతర్జాతీయ టీ20లలో బ్రూక్ ప్రభావం చూపుతున్నా దుబాయ్‌లో జరుగుతున్న వేలంలో మాత్రం ఫ్రాంచైజీలు అతడిని లైట్ తీసుకున్నాయి. గత సీజన్ అంత రాకపోయినా కనీసం రూ. 10 కోట్ల వరకైనా పలుకుతాడని ఆశించినా అతడికి అంత సీన్ లేదని ఫ్రాంచైజీలు తేల్చేశాయి.తాజా సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ అతడిని రూ. 4 కోట్లకే దక్కించుకుంది. గతేడాది ధరతో పోలిస్తే బ్రూక్.. ఏకంగా రూ. 9.25 కోట్లు కోల్పోయాడు. గత సీజన్‌లో బ్రూక్.. 11 మ్యాచ్‌లు ఆడి 190 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఇందులో కోల్‌కతా నైట్ రైడర్స్ తో జరిగిన మ్యాచ్‌లో సెంచరీ మాత్రమే ఉంది. గత సీజన్‌లో బ్రూక్ కోసం ఎగబడ్డ హైదరాబాద్ ఈసారి ప్యాట్ కమిన్స్‌కు ఏకంగా రూ. 20.50 కోట్లు పెట్టి దక్కించుకున్న విషయం తెలిసిందే.

# అనామక ప్లేయర్‌కు రూ. 7 కోట్లు.. జార్ఖండ్ నుంచి మరో ధోనీ..!



దుబాయ్ వేదికగా జరుగుతున్న ఐపీఎల్ మినీ వేలంలో జార?ండ్‌కు చెందిన వికెట్ కీపర్ బ్యాటర్ కుమార్ కుశాగ్ర జాక్‌పాట్ కొట్టాడు. వేలంలో రూ. 20 లక్షల కనీస ధరతో అడుగుపెట్టిన కుశాగ్ర.. ఎవరూ ఊహించని విధంగా రూ. 7.2 కోట్ల ధర దక్కించుకోవడం గమనార్హం. దేశవాళీ క్రికెట్‌లో కూడా పెద్దగా వినిపించని కుశాగ్ర పేరు.. వేలంతో మార్మోగిపోతోంది. ఢిల్లీ క్యాపిటల్స్ అతడికి భారీ ధర వెచ్చించి సొంతం చేసుకుంది. కుశాగ్ర కోసం ఐపీఎల్ దిగ్గజ ఫ్రాంచైజీ చెన్నై సూపర్ కింగ్స్‌తో పాటు ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్‌లు పోటీపడటం విశేషం. ఇంతకీ ఎవరీ కుశాగ్ర..?

### జార్ఖండ్ డైనమైట్..

భారత క్రికెట్ జట్టుకు రెండు వరల్డ్ కప్‌లు, ఒక ఛాంపియన్స్ ట్రోఫీ అందించిన మహేంద్ర సింగ్ ధోనీ స్వరాష్ట్రం జార్ఖండ్‌కు చెందినవాడే కుశాగ్ర. రాష్ట్రంలోని బొకారో వాసి అయిన అతడు.. 2004 అక్టోబర్ 23న జన్మించాడు. ధోనీని ఆరాధించే కుశాగ్ర.. అతడి మాదిరిగానే వికెట్ కీపర్ బ్యాటర్ కావడం గమనార్హం. 19 ఏండ్ల ఈ కుర్రాడు రెండేండ్ల క్రితమే దేశవాళీ క్రికెట్‌లో ఎంట్రీ ఇచ్చాడు.

# ట్రోఫీల పంట పండించి.. 'వరల్డ్ చాంపియన్' అవార్డు కొల్లగొట్టిన జకోవిచ్, సబలెంక

ఈ ఏడాది జోరుమీదున్న వరల్డ్ నంబర్ 1 నొవాక్ జకోవిచ్ మరో ఘనత సాధించాడు. పురుషుల సింగిల్స్‌లో అత్యధిక గ్రాండ్‌స్లామ్స్‌తో రికార్డు నెలకొల్పిన జకో.. అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య అందించే ప్రతిష్ఠాత్మక 'వరల్డ్ చాంపియన్ 2023' అవార్డును గెలుచుకున్నాడు. ఇక మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ అరినా సబలెంక ఈ అవార్డుకు ఎంపికైంది. ఈ ఏడాది అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన జకో మూడు ట్రోఫీలు గెలవగా.. సబలెంక ఒక్క ట్రోఫీతో మెరిసింది. మొత్తంగా నాలుగు గ్రాండ్‌స్లామ్స్‌లో సెమీస్‌కు దూసుకెళ్లినందున వీళ్లిద్దరిని ఈ అవార్డు వరించింది.



# కొత్త కండీషన్లు పెడుతున్న రైతుబిడ్డ!




**తెలంగాణ వీణ/సినిమా :** అలా ప్రశాంత్ వినయ, విధేయత చాలామందిని కట్టిపడేసింది. పొగడ్తలకు ఉప్పొంగిపోకుండా ఒదిగి ఉండే తీరుకు ప్రేక్షకులు ముచ్చటపడ్డారు, గెలిపించారు. ఇక్కడివరకు అంతా బానే ఉంది.. కానీ తర్వాతే సీన్ రివర్స్ అయింది. టైటిల్ గెలిచిన తర్వాత ప్రశాంత్ కాళ్లు భూమి మీద లేవు. గాల్లో తేలుతున్నాడు. షోలోకి వెళ్లడం కోసం యూట్యూబ్ ఛానల్స్‌కు ఇంటర్వ్యూలు ఇచ్చి తనకు సపోర్ట్ చేయమన్న రైతుబిడ్డ ఇప్పుడు కప్పుతో వచ్చిన తర్వాత యూట్యూబ్ యాంకర్లను అస్సలు పట్టించుకోవడం లేదట. అంతే కాదు ఇంటర్వ్యూ అడిగితే కూడా చాలా దురుసుగా చులకన చేసి మాట్లాడుతున్నాడట. ఒక్క ఇంటర్వ్యూ అని అడిగితే.. మీరు మా పొలం దగ్గరకు రండి.. పనులు చేయండి.. వీడియో తీసుకోండి. మీ యూట్యూబ్ ఛానల్స్ నుంచి రైతులకు ఏమిస్తారో చెప్పుర్రి. ఆ తర్వాతే మీకు ఇంటర్వ్యూలు ఇస్తా అంటూ అతి చేస్తూ మాట్లాడాడు. ఇక మల్లన్నసాగర్ ప్రాజెక్ట్ వల్ల భూములు కోల్పోయిన దాదాపు 15 గ్రామాల రైతులకు గతంలో ఏమైనా సాయం చేశారా? వారికి అండగా నిలిచారా? అని ఓ యాంకర్ అడిగాడు. దీనికి ప్రశాంత్ స్పందిస్తూ.. నాకేమైనా సీఎం పదివి ఇచ్చిర్రా? ఏదైనా చేయడానికి! నేను ఒక రైతుబిడ్డను కదా సీఎం చేస్తరా చెప్పుండ్రి.. అందరినీ ఆదుకుంటా.. నేనేమైనా నాయకుడినా? నేనూ ఒక రైతుబిడ్డనే నేనేం చేస్తా అని వెటకారంగా నవ్వుతూ సమాధానమిచ్చాడు.

# 35 ఏళ్ల వయసులోనూ స్లిమ్‌గా..



తెలంగాణ వీణ/సినిమా : మూడు పదులు దాటితే చాలు కొందరి ముఖంలోనే వారి వయసు కనబడిపోతుంటుంది. కానీ నయనతార, త్రిష వంటి అతి కొద్దిమంది హీరోయిన్లు మాత్రం తమ అందంతో వయసును దాచేస్తారు. ఆ కోవలోకి హీరోయిన్ వేదిక చేరతారు. ఇంకా చెప్పాలంటే వారి కంటే కూడా చాలా స్లిమ్‌గా యవ్వనంగా కనిపిస్తారు. ఈమె వయసు మూడున్నర పదులు అంటే ఎవరైనా ఆశ్చర్యపోతారు. అంత నాజుగ్గా కనిపించే వేదికకు తనకంటూ పెద్ద అభిమాన గణమే ఉన్నారు. ఈమె మోడలింగ్ రంగం నుంచి వచ్చి కథానాయికగా సినీ రంగ ప్రవేశం చేశారు.అలా ఈ బ్యూటీ పలు భాషల్లో పలు చిత్రాల్లో నటిస్తూ ఫుల్ బిజీగా ఉన్నారు. ఈమె మదరాసి అనే చిత్రం ద్వారా కోలీవుడ్‌లో రంగ ప్రవేశం చేశారు. ఆ తర్వాత బాల దర్శకత్వం వహించిన పరదేశి చిత్రంలో నటించి అందరి ప్రశంసలు అందుకున్నారు. అదేవిధంగా సిద్ధార్ధ్ కు జంటగా కావ్య తలైవన్, రాఘవ లారెన్స్ సరసన ముని కాంచన- 3 వంటి పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి తన సత్తా చాటుకున్నారు.కాగా తమిళంతో పాటు తెలుగు, మలయాళం, కన్నడం, భాషల్లోనూ నటిస్తూ బహు భాషా నటిగా రాణిస్తున్న వేదిక ప్రస్తుతం అరడజనుకు పైగా చిత్రాలతో బిజీగా ఉన్నారు. వీటిలో రెండు తెలుగు, రెండు తమిళం, రెండు మలయాళం, ఒక కన్నడ చిత్రాలు ఉండటం విశేషం. చిత్రాల ఎంపికలో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్న వేదిక, నటనకు అవకాశం ఉన్న కథా చిత్రాలకే అధిక ప్రాధాన్యత ఇవ్వడం విశేషం. అందుకే నేటికీ ఈమె కథానాయికగా కొనసాగుతున్నారని చెప్పవచ్చు.

# నా దేశంలో రక్షణ లేకుండా పోయింది.. అడుగు బయటపెట్టాలంటేనే..



తెలంగాణ వీణ/సినిమా : తన దేశంలో తనకు రక్షణ లేకుండా పోయిందంటోంది పాకిస్తాన్ నటి ఆయేషా ఒమర్. తనతో పాటు ఆ దేశంలో ఉన్న మహిళలందరికీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలే కరువైపోయాయంటోంది. తాజాగా ఆమె ఓ మీడియాతో మాట్లాడుతూ.. నాకు ఇక్కడ సేఫ్‌గా అనిపించడం లేదు. కాసేపు స్వచ్ఛమైన గాలి పీల్చుకోవడానికి బయటకు వెళ్లాలనిపిస్తుంది సరదాగా సైకిల్ తొక్కాలనిపిస్తుంది. వాకింగ్ చేయాలనీ ఉంటుంది. కానీ ఏదీ చేయలేకపోతున్నాను. కరాచీ అంత సురక్షితమైన ప్రదేశం కాదనిపిస్తోంది. ఇక్కడ నాకు ఒత్తిడి, ఆందోళన ఎక్కువవుతోంది. బహుశా చాలామంది మహిళల పరిస్థితి ఇంచుమించు ఇలాగే ఉండొచ్చు. పాకిస్తాన్ మహిళలు ఎంత ఇబ్బందిపడుతున్నారో మగవాళ్లు ఎంత ప్రయత్నించినా అస్సలు అర్థం చేసుకోలేరు. ఆడవాళ్ల భయాందోళనలు వారికి ఎన్నటికీ అర్థం కావు. ఇక్కడివాళ్లు ప్రతి క్షణం భయపడుతూ నరకం చస్తున్నారు. నాపై రెండుసార్లు దాడి జరిగింది. ఎప్పుడు, ఎవరు.. ఎటు నుంచి వచ్చి కిడ్నాప్ చేస్తారో, దాడి చేస్తారో, అత్యాచారం చేస్తారోనని చాలా భయంగా ఉంది. ప్రతి మనిషికి స్వేచ్ఛ, రక్షణ తప్పనిసరిగా అవసరం. కానీ ఆ రెండు ఇక్కడ దొరకట్లేదు.

# సుహాసిని ప్రధాన పాత్రలో 'మహతి'



**తెలంగాణ వీణ/సినిమా :** యంగ్ టాలెంటెడ్ హీరో సందీప్ మాధవ్ కథానాయకుడిగా శివప్రసాద్ స్వీయ దర్శకనిర్మాణంలో శ్రీ పద్మిని సినిమాస్ ప్రొడక్షన్ నెంబర్ 3గా రూపొందుతున్న 'మహతి' ఈ రోజు పూజా కార్యక్రమాలతో గ్రాండ్ గా ప్రారంభమైంది. సుహాసిని మణిరత్నం, దీప్సిక కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమా ముహూర్తపు సన్నివేశానికి చంద్రమౌళి క్లాప్ కొట్టగా, పద్మ కెమెరా స్విచాన్ చేశారు. సుహాసిని మణిరత్నం మేకర్స్ కి స్క్రిప్ట్ ని అందించగా తొలి షాట్ కి రాజారవీంద్ర గౌరవ దర్శకత్వం వహించారు. ఇక ఈ సినిమా లాంచింగ్ ఈవెంట్ లో సుహాసిని మణిరత్నం మాట్లాడుతూ.. మహతి సినిమా ముహూర్తంలో అందరినీ కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందని, తన తొలి సినిమా విడుదలై నేటికి సరిగ్గా 43 ఏళ్ళు అవుతుందని అన్నారు. పరిశ్రమలో 44 ఏడాది మహతి సినిమాతో ప్రారంభిస్తున్నా, ఇప్పటివరకూ కెరీర్లో ఎన్నో చిత్రాలు చేశా, ఎన్నో జయపజయలు చూశా అవన్నీ గతంలోనే వదిలేసి ఇప్పుడు తొలి సినిమా చేస్తున్న అనుభూతితోనే ఈ సినిమా చేస్తున్నాను.తెలుగు సినిమాలో చేయడం ఒక అలవాటుగా మారిందన్న ఆమె కథ, పాత్ర నచ్చితేనే సినిమా చేస్తా, మహతి కథ, నా పాత్ర చాలా నచ్చిందని అన్నారు. ఫ్యామిలీ ఎమోషన్స్, సెంటిమెంట్స్ ఉంటాయని టైటిల్ కి తగట్టు మహిళా ప్రాధాన్యత గల చక్కని అంశాలు ఉన్నాయని అన్నారు. ఒక క్రైమ్ చేయడం కంటే ఆ క్రైమ్ ని చూస్తూ ఏం చేయకుండా ఊరుకోవడం ఇంకా పెద్ద క్రైమ్ అనేదే ఈ సినిమా ప్రధానాంశం. ఇక హీరో సందీప్ మాధవ్ మాట్లాడుతూ మహతి కథ విన్నప్పుడు చాలా ఎక్సైటింగ్ గా ఫీలయ్యా, డైరెక్టర్ శివ ఆద్యంతం ఆకట్టుకునేలా ఈ కథని తీర్చిదిద్దారని, నా పాత్రకు డిఫరెంట్ షేడ్స్ ఉంటాయని, చాలా అద్భుతంగా డిజైన్ చేశారని అన్నారు. సుహాసినితో స్క్రీన్ షేర్ చేసుకోవడం చాలా ఆనందంగా ఉంది, ఖచ్చితంగా సినిమా ప్రేక్షకులని అలరిస్తుందన్నారు.

# ప్రశాంత్ వర్మ నుంచి 'హనుమాన్'... ట్రైలర్ రిలీజ్!



**తెలంగాణ వీణ/సినిమా :** తేజ సజ్జ హీరోగా దర్శకుడు ప్రశాంత్ వర్మ 'హను మాన్' సినిమాను రూపొందించాడు. అమృత అయ్యర్ కథానాయికగా నటించిన ఈ సినిమాకి, నిరంజన్ రెడ్డి నిర్మాతగా వ్యవహరించాడు. హీరోకి అక్కయ్య పాత్రలో వరలక్ష్మి శరత్ కుమార్ కనిపించగా, ప్రత్యేకమైన పాత్రను సముద్రఖని పోషించాడు. కొంతసేపటి క్రితం ఈ సినిమా నుంచి ట్రైలర్ ను వదిలారు. హీరో ఫ్యామిలీ అంజనాద్రి ప్రాంతంలో నివసిస్తూ ఉంటుంది. ధర్మాన్ని ఆచరించే ప్రతి ఒక్కరి వెంట హనుమంతుడు ఉంటాడని హీరో భావిస్తూ ఉంటాడు. మానవాతీతమైన శక్తులను సంపాదించుకోవడం కోసం విలన్ అక్కడ అడుగుపెడతాడు. అతణ్ణి హీరో ఎలా ఎదిరించాడనేదే కథ అనే విషయం ట్రైలర్ ను బట్టి అర్థమవుతోంది. కొండలు .. జలపాతాలు .. సెలయేళ్లు .. పక్షులు .. మంచుకొండలో హనుమ ధ్యానంలో ఉండటం .. వంటి విజువల్స్ గొప్పగా ఉన్నాయి. సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. జనవరి 12వ తేదీన ఈ సినిమాను 11 భాషల్లో విడుదల చేయనున్నారు. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకూ నచ్చే కంటెంట్ కావడంతో, సంక్రాంతికి ఈ సినిమా సందడి చేయడం ఖాయంగానే కనిపిస్తోంది.

# షూటింగు దశలో ఉన్న 'దేవర' ప్రతి ఫైటూ ఓ క్లైమాక్స్!



**తెలంగాణ వీణ/సినిమా :** ఇప్పుడు ఎన్టీఆర్ అభిమానులంతా 'దేవర' సినిమా కోసమే వెయిట్ చేస్తున్నారు. ఈ సినిమాలో ఆయన గెటప్ డిఫరెంట్ గా ఉంది. సముద్రతీర ప్రాంతానికి సంబంధించిన కథతో ఈ సినిమా నడుస్తుంది. అందుకు తగినట్టుగానే దర్శకుడు కొరటాల ఆయన లుక్ ను డిజైన్ చేశాడు. ఎన్టీఆర్ ఫస్టులుక్ తోనే ఈ సినిమాలో యాక్షన్ సీన్స్ ఏ రేంజ్ లో ఉంటాయనేది ఆడియన్స్ కి అర్థమైపోయింది. ఈ సినిమాకి సంబంధించిన తదుపరి షెడ్యూల్ ను జనవరి మొదటి వారంలో ప్లాన్ చేసినట్టుగా తెలుస్తోంది. ఈ సినిమాలో ప్రతినాయకుడిగా సైఫ్ అలీఖాన్ కనిపించనున్న సంగతి తెలిసిందే. ఎన్టీఆర్ – సైఫ్ కాంబినేషన్ లోని రెండు భారీ యాక్షన్ సన్నివేశాలను ఈ షెడ్యూల్‌లో చిత్రీకరించనున్నట్టుగా చెబుతున్నారు. ఈ షెడ్యూల్ లో జరిగే పోరాట సన్నివేశాలను పీటర్ హెయిన్ డిజైన్ చేశాడు. యాక్షన్ ఎపిసోడ్స్ చాలా కొత్తగా .. ఆశ్చర్యపోయేలా ఉంటాయనీ, ప్రతి ఫైటూ క్లైమాక్స్ లా అనిపిస్తుందని అంటున్నారు. ఇక ఈ సినిమాతోనే టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న జాన్వీ కపూర్ ప్రత్యేక ఆకర్షణ. ఏప్రిల్ 5వ తేదీన పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# ప్రెసోథెరపీ చేయించుకున్న బాలీవుడ్ హాట్ బ్యూటీ...

**తెలంగాణ వీణ/సినిమా :** బాలీవుడ్ హాట్ బ్యూటీ ఊర్వశి రౌటెల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.. ఊర్వశి రౌటెల తాజాగా ప్రెసోథెరపీ చేయించుకుంది.గుండెకి ఈసీజీ తీసే సమయంలో డాక్టర్లు పేషెంట్ ని బెడ్ మీద నిటారుగా పడుకోబెట్టి ఈసీజీ తాలుకా వైర్లు అన్ని శరీరానికి అతికించి..వాటిని మోనిటర్ కి ఎలా కనెక్ట్ చేస్తారో తెలిసిందే కదా..గుండె సక్రమంగా పనిచేస్తుందా లేదా..అని తెలుసుకోవడం కోసం ఈ పరీక్ష చేస్తుంటారు. అందులో రిపోర్ట్ ని బట్టి గుండె ఎలా పనిచేస్తుంది.. అన్నది డాక్టర్లు నిర్ధారిస్తారు.తాజాగా హాట్ బ్యూటీ ఊర్వశి రౌతేలా కూడా అలాంటి పరీక్షే చేయించుకున్నట్లు తెలుస్తుంది.కాకపోతే ఇది గుండెకి సంబంధించిన పరీక్ష కాదు. ఇదో రకమైన థెరపీ అని తెలుస్తుంది. ఊర్వశి ని ఇలా పెషెంట్ లా సిద్ధం చేసి ఆమె కాళ్లకు,నడుం భాగాలకు ఏవో వైర్లు తగిలించారు. వాటిని మోనిటర్ కి కనెక్ట్ చేసారు. దీనినే ప్రెస్సోథెరపీ అంటారట. అంటే శరీరం మొత్తాన్ని నిర్విషీకరణ చేస్తుంది. శరీరం యొక్క శోషరస వ్యవస్థను ప్రేరేపిస్తుంది. తర్వాత శరీరంలో టాక్సిన్స్ ను కూడా తొలగిస్తారు.ఈ థెరపీ ద్వారా బలమైన రోగనిరోధక వ్యవస్థ అభివృద్ధిలోకి వస్తుందని తెలుస్తుంది.అయితే ఊర్వశి ఇమ్యునిటీ పవర్ బాగా తగ్గింది అనుకుంటా ఈభామ థెరపీల జోలికి వెళ్లినట్లుంది..


## రిపోర్టర్లు కావలెను

తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
తెలుగు దినపత్రిక
69 TV తెలుగు

తెలుగు లో రాయగల సమర్థత ,
సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు

తెలుగు రాష్ట్రాలలో సంచలనాలు సృష్టిస్తున్న
తెలంగాణ వీణ తెలుగు దినపత్రిక
మీకు సరైన వేదిక

అన్నీ జిల్లాలు , మండలాలు, నియోజకవర్గాల పరిధిలో
పని చేసేందుకు అవకాశం కలిపిస్తోంది.

వివరాల కొరకు సంప్రదించల్సిన ఫోన్ నెంబర్ లు
91 90525 22626
91 98485 99616

email: telanganaveenaofficial@gmail.com
Website: https://telanganaveena.com/



Published and Printed by Vulloju Srinivas on Behalf of Sri Veena Publications Printed at Telangana Veena Flat N0: 204 Mythri Apartments,Opp Bsnl Office Ecil,Kapra,Med Responsible for Selection of News Under the PRB ACT, Phone number: 040 35668720,RNI Reg N0.TELTEL/12280 Reproduction in Whole or in Part Without Written